Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 176 మేడ్చల్ మల్కాజ్‌గిరి 18 జులై 2024 గురువారం పేజీలు : 4

### సరిహద్దు ఉగ్రవాద శిబిరాలకు పాక్ నిధులు

ఢిల్లీ: పీఓకే సరిహద్దులో ఈ మధ్య కాలంలో ఉగ్రవాద కార్యకలాపాలు పెరిగిపోతున్నాయి. అయితే ఉగ్రవాద శిబిరాల జాబితాను సిద్ధం చేస్తున్న తరుణంలో భారత ఆర్మీ విచారణలో కీలక విషయాలు బయటకి వచ్చాయి. సరిహద్దులో ఉన్న టెర్రరిస్టు శిబిరాలకు పాకిస్థాన్ ప్రభుత్వం నిధులు సమకూరుస్తున్నట్లు తేలింది. జూలై 16న కశ్మీర్‌లోని దోడా జిల్లాలో ఉగ్రవాదులతో జరిపిన కాల్పుల్లో ఒక అధికారితో సహా నలుగురు ఆర్మీ సిబ్బంది గాయపడ్డారు. కతువా జిల్లాలోని రిమోట్ మాచెడి అటవీ ప్రాంతంలో ఆర్మీ పెట్రోలింగ్ వాహనంపై ఉగ్రవాదుల దాడిలో ఐదుగురు సైనికులు మరణించారు. అనేక మంది గాయపడ్డారు. ఆగ్రహించిన భారత ఆర్మీ.. వారి మూలాలను వెతికే పనిలో పడింది. ఈ క్రమంలో పాక్ నిధుల వ్యవహారం బయటకి వచ్చింది.

# ఆగస్టులోపే 3 విడతల్లో రుణమాఫీ పూర్తి చేస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి




హైదరాబాద్: ఆగస్టులోపే 3 విడతల్లో రుణమాఫీ పూర్తి చేస్తామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం 4 గంటలకు రుణమాఫీ నిధులు విడుదల చేస్తామని చెప్పారు. తొలి విడతగా రూ.లక్ష వరకు ఉన్న రైతు రుణాలకు నిధుల విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ నెలాఖరులోపు రూ. 1.5లక్షల వరకు ఉన్న రుణాలు మాఫీ చేస్తామన్నారు. ఆగస్టులో రూ. 2లక్షల వరకు ఉన్న రుణాలు మాఫీ చేస్తామని సీఎం వివరించారు.

**గాంధీ కుటుంబం మాట ఇస్తే అది శిలాశాసనం :** ప్రజాభవన్‌లో

## తెలంగాణ మోడల్‌ను దేశం అనుసరించేలా ఉండాలి

ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ నేతలతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. " ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తామని పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో చెప్పాం. ఆర్థిక నిపుణులు కూడా రుణమాఫీ కష్టమని చెప్పారు. ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

పదేళ్లు అధికారంలో ఉండి కేసీఆర్ రూ. 28వేల కోట్లు కూడా రైతు రుణమాఫీ చేయలేకపోయారు. రైతు రుణమాఫీ చేస్తామని రాహుల్ గాంధీ మాట ఇచ్చారు. ఆయన మాట ఇచ్చారంటే అది చేసి తీరుతారన్న నమ్మకం కలిగించడం మన బాధ్యత. గాంధీ కుటుంబం మాట ఇస్తే అది శిలాశాసనం. పార్టీకి నష్టమని తెలిసి కూడా సోనియాగాంధీ ఆనాడు సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు.

**రైతు ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకే రుణమాఫీ :** ఈ దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలవాలి. వ్యవసాయ విధానంలో తెలంగాణ మోడల్‌ను దేశం అనుసరించేలా ఉండాలి. నా జీవితంలో ఇది ఎప్పటికీ గుర్తుండిపోయే రోజు. గురువారం సాయంత్రం 4గంటలకు రూ.లక్ష వరకు ఉన్న రైతు రుణాలు మాఫీ చేస్తున్నాం. రూ. 7వేల కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లోకి వెళతాయి. నెలాఖరులోగా రూ.లక్షన్నర వరకు ఉన్న రుణాలు మాఫీ చేస్తాం. ఆగస్టులోగా రూ. 2లక్షల వరకు ఉన్న రుణాలు మాఫీ చేసి ఆ ప్రక్రియను పూర్తి చేస్తాం.

రుణమాఫీ పేరుతో కేసీఆర్ లాగా మాటలు చెప్పి రైతులను మభ్యపెట్టడం లేదు. రైతు రుణమాఫీపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది. అందుకే ఏక మొత్తంలో రూ. 2లక్షల రుణమాఫీ పూర్తి చేస్తున్నాం. రైతు ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకే రుణమాఫీ. మనం చేస్తున్న మంచి పనిని ప్రజలకు వివరించండి.

**హామీని నిలబెట్టుకున్నామని సగర్వంగా చెప్పండి :** గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిల్లో కార్యక్రమాలు నిర్వహించండి. రుణమాఫీ హామీని నిలబెట్టుకున్నామని సగర్వంగా చెప్పండి. ఈ అంశంపై జాతీయస్థాయిలో చర్చ జరగాలి. దేశంలో ఏ రాష్ట్రం కూడా ఒకే విడతలో రూ. 31వేల కోట్లతో రుణమాఫీ చేయలేదు. రాహుల్ గాంధీ ఇచ్చిన గ్యారెంటీని అమలు చేశామని పార్లమెంట్ లో ఎంపీలు ప్రస్తావించాలి. గురువారం గ్రామాల్లో, మండల కేంద్రాల్లో కూడలి నుంచి రైతు వేదికల వరకు బైక్ ర్యాలీలు నిర్వహించాలి.

ఎమ్మెల్యేలు నియోజకవర్గ కేంద్రాల్లో కార్యక్రమాల్లో పాల్గొనాలి. ఎక్కడికక్కడ ఒక పండగ వాతావరణంలో సంబరాలు జరపాలి. ఏడు నెలల్లో మన ప్రభుత్వం సంక్షేమానికి రూ. 30వేల కోట్లు ఖర్చు చేసింది" అని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు.




## ఈనెల 20న ఢిల్లీకి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.. ఎందుకంటే..?

హైదరాబాద్: ఢిల్లీకి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈనెల 20 వ తేదీన వెళ్లనున్నారు. అక్కడ నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ అధికారులతో భేటీ కానున్నారు. మేడిగడ్డ, అన్నారం , సుందిళ్ల బ్యారేజ్‌లపై ఎన్డీఎస్ఏతో ఉత్తమ్ చర్చించనున్నారు. ఎన్డీఎస్ఏ అధికారులతో పలు ప్రాజెక్టులకు సంబంధించిన విషయాలపై ఆరా తీయనున్నారు. వర్షాల నేపథ్యంలో డ్యామ్‌ల వద్ద తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నారు. అలాగే రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ ప్రాజెక్టులపై సమీక్ష చేయనున్నారు. ఢిల్లీ పర్యటనకు సంబంధించిన వివరాలను ఈరోజు( బుధవారం) మంత్రి ఉత్తమ్ మీడియాకు వెల్లడించారు. రూ. 28 వేల కోట్లను రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు చేసినట్లు తెలిపారు.


రూ.18 వేల కోట్లు గత ప్రభుత్వ అప్పుల ఇంట్రెస్ట్‌కి పోతున్నాయని తెలిపారు. ఈ వర్క్స్ ఎక్స్‌పెండిచర్ కోసం రూ.11 వేల కోట్ల బడ్జెట్‌లో పెట్టాలని ఆర్థిక శాఖని కోరుతున్నామని అన్నారు. 2025 డిసెంబర్ 25 వరకు పాలమూరు జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తామని తెలిపారు. డిండి కూడా తమ ప్లాన్‌లో ఉందని వివరించారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి బడ్జెట్ వేసి ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌కి పంపుతున్నామని అన్నారు. సమ్మక్క ప్రాజెక్ట్ కోసం ఛత్తీస్‌గఢ్‌తో ల్యాండ్ కోసం సంప్రదింపులు చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. అయితే భారీ వర్షాల నేపథ్యంలో పలు ప్రాజెక్టుల వద్ద ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. బ్యారేజీకి సంబంధించిన ఇరిగేషన్ అధికారులతో సమావేశమై పలు అంశాలపై ప్రత్యేకంగా సమీక్షిస్తుంది. భారీవర్షాలు పడితే ప్రాజెక్టులకు ఏమైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందా అనే కోణంలోనూ అధికారుల నుంచి మంత్రి వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. మరోవైపు పెండింగ్‌లో ఉన్న నీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం దృష్టి సారించింది. రాష్ట్రంలోని నీటి ప్రాజెక్టులకు కేంద్రం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం డిమాండ్ చేస్తోంది.

## అప్పుల్లో ఉన్నా.. నెలల వ్యవధిలోనే రుణమాఫీ అమలు చేస్తున్నాం: భట్టి

హైదరాబాద్: ఆగస్టు నెల దాటకుండానే రూ. 2లక్షల రైతు రుణమాఫీ పూర్తి చేస్తామని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రజాభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రుణమాఫీ హామీ అమలు కోసం నిద్రలేని రాత్రులు గడిపామని, రూపాయి.. రూపాయి పోగుచేసి ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. రేషన్‌కార్డులు లేని ఆరు లక్షల మంది రైతు కుటుంబాలకు కూడా రుణమాఫీ అందిస్తామని తెలిపారు. రుణమాఫీ కార్యక్రమాన్ని పోలింగ్ బూత్ స్థాయిలో ప్రతి ఓటరు దగ్గరకు తీసుకెళ్లాలని, తల ఎత్తుకొని.. ఎక్కడా తగ్గకుండా ప్రచారం చేయాలని కాంగ్రెస్ నాయకులకు భట్టి



సూచించారు. "రూ. 7లక్షల కోట్ల అప్పుతో అధికార బాధ్యతలు తీసుకున్న కాంగ్రెస్ రూ. 2లక్షల రుణమాఫీని నెలల వ్యవధిలోనే అమలు చేస్తోంది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అధికారంలోకి వచ్చిన కొద్దికాలంలోనే హామీలు అమలు చేస్తున్నాం. కానీ, అనుకున్నంత ప్రచారం క్షేత్రస్థాయిలో జరగట్లేదు. పార్లమెంట్ ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టులోపు రూ. 2లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటిస్తే అంతా ఆశ్చర్యపోయారు. సీఎం సవాల్ ఓట్ల కోసమే అనుకున్నారు. కానీ, అందరి అంచనాలు తలకిందులు చేస్తూ రుణమాఫీ చేస్తున్నాం. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందని వివరిస్తూ రైతులు, ప్రజల హృదయాలు గెలవాలి" అని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.



## పేద రైతులకు అన్యాయం జరగకుండా చూడండి...

సిద్దిపేట జిల్లా, జూలై 17: నాలుగు రోజుల క్రితం కొండపాక మండలం దమ్మక్కపల్లి గ్రామంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రైతు బండి కిష్టయ్యను.. మాజీ మంత్రి హరీష్ రావు పరామర్శించారు. భూ తగాదాల విషయంలో గడ్డి మందు సేవించి బలవన్మరణానికి యత్నించడంతో బండి కిష్టయ్యను వెంటనే ములుగు మండలంలోని ఆర్‌వీఎం ఆసుపత్కి తరలించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని హరీష్ రావు పరామర్శించి.. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం మాజీ మంత్రి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇష్టారాజ్యంగా పేద రైతుల భూముల మీద దాడులు చేసి భూములను లాక్కుంటున్న ఘటనలకు రాష్ట్ర వ్యాప్తంగా పెరిగిపోయాయన్నారు.


న్యాయం చేయండని అడిగిన కొండపాక మండలం దమ్మక్క పల్లి గ్రామానికి చెందిన బండి కిష్టయ్య అనే రైతుపై కేసు పెట్టి భయ బ్రాంతులకు గురిచేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల దౌర్జన్యం వల్ల, విపరీత చర్యలతో అధికారుల మీద ఒత్తిడి చేయడం వల్ల ఈ ఘటన జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీనిపై అడిషనల్ కలెక్టర్ స్థాయి అధికారితో విచారణ జరపాలని కోరినట్లు తెలిపారు. ఈ ఘటనపై రాష్ట్ర డీజీపీ సమగ్ర విచారణ జరిపి రైతు ఆత్మహత్యకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రి రాష్ట్రంలో జరుగుతున్న ఇలాంటి దౌర్జన్యాలు ఆపాలన్నారు. పేద రైతులకు అన్యాయం జరగకుండా చూడాలన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి రైతు భూమి రైతుకు దక్కేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ,రెవెన్యూ మంత్రికి హరీష్ రావు డిమాండ్ చేశారు. హరీష్‌రావుతో పాటు మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి బాధిత రైతును పరామర్శించారు.

# రైతు ఇంట పండుగ వాతావరణం

## నేడు రాష్ట్ర బ్యాంకర్లతో సీఎం సమావేశం

## వెను వెంటనే రైతులను ఉద్దేశించి సందేశం




హైదరాబాద్: ప్రజాభవన్ లో రేపు ఉదయం 10 గంటలకు రాష్ట్ర స్థాయి బ్యాంకర్లతో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరుగనున్న సమావేశానికి డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రామకృష్ణారావు, తదితరులు పాల్గొననున్నారు.

లక్ష రూపాయల లోపు రైతు రుణమాఫీ అమలులో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి దిశా నిర్దేశం చేయనున్నారు. రూ. లక్ష రూపాయల లోపు రైతు రుణమాఫీ చేయనున్న నేపథ్యంలో అన్ని మండల కేంద్రాలలో ఉన్న రైతు వేదికల్లో రైతుల సమావేశాలు నిర్వహించనున్నారు.

దీంతో హైదరాబాదు నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి సందేశం ఇవ్వనున్నారు. రైతు వేదికల దగ్గర సంబరాలకు పిలుపు నిచ్చారు. రేపు సాయంత్రానికి రైతుల ఖాతాలోకి లక్ష రుణమాఫీ చేయనున్నారు. ఒకటి, రెండు రైతులతో సీఎం స్వయంగా మాట్లాడనున్నారు. ఇక రాష్ట్రంలో రుణమాఫీ అమలులో భాగంగా తొలి విడతగా రూ.లక్ష మేర రుణాలున్న రైతుల ఖాతాల్లో రేపు (గురువారం) నగదు జమ జరగనుంది. దీనికి సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా రైతు వేదికల వద్ద రుణమాఫీ లబ్ధిదారులతో కలిసి సంబురాలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

## సంపాదకీయం

# బీజేపీకి బాధ్యత లేదా? బడ్జెట్ వేళ ఏం చేస్తారో?

ఏపీలోని కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యమైన.. బీజేపీ ఒకమంత్రి పదవిని కూడా తీసుకున్న విషయం తెలిసిందే. ధర్మవరం ఎమ్మెల్యే సత్య కుమార్ యాదవ్‌కు చంద్రబాబు కీలకమైన వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి పదవిని కేటాయించారు. ఇక, టీడీపీ-జనసేనలతో జత కట్టిన నేపథ్యంలో బీజేపీ ఏకంగా 8 మంది ఎమ్మెల్యేలను గెలిపించుకుంది. ఈ నేపథ్యంలో త్వరలోనే కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న బడ్జెట్‌లో ఏపీకి సంబంధించి నిధుల కేటాయింపుపై చర్చించేందుకు చంద్రబాబు ఇప్పటికే ఒక సారి ఢిల్లీ వెళ్లి ప్రతిపాదనలు ఇచ్చి వచ్చారు. ఇప్పుడు(మంగళవారం) మరోసారి ఆయన ఢిల్లీకి వెళ్లారు. ఈ నేపథ్యంలో బీజేపీ తరపున కూడా.. కేంద్రం పై ఒత్తిడి తీసుకురావాలనే సూచనలు వినిపిస్తున్నాయి. రాష్ట్రానికి ఏమేమేం అవసరమో.. ఎంతెంత నిధులు కావాలో.. బీజేపీ కి కూడా తెలుసు కాబట్టి ఆదిశగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అసవరం ఉందని అభిప్రాయపడుతున్నారు. అయితే.. ఇప్పటి వరకు బీజేపీ నాయకులు ఎవరూ కూడా స్పందించలేదు. రాష్ట్రంలో నలుగురు బీజేపీ ఎంపీలు ఉన్నారు. వారు కూడా.. పార్లమెంటు సమావేశాల్లో ఏపీకి సంబంధించిన నిధుల వ్యవహారాన్ని లేవనెత్తడంతో పాటు.. బడ్జెట్ ప్రతిపాదనల్లోనూ వారు కొన్ని సూచనలు చేసి.. ఏపీకి వచ్చే నిధులపై కేంద్రాన్ని ప్రశ్నించడమో.. బ్రతిమాలడమో చేయాలన్న సూచనలు కూటమి పార్టీల నుంచే వినిపిస్తున్నాయి. వారు కూడా రాష్ట్రంలో ఎదగాలని భావిస్తున్న నేపథ్యంలో మౌనంగా ఉంటే సరికాదని.. అంతా చంద్రబాబుపై భారం వేసి చూస్తూ.. కూర్చుంటే ఎలా అనే ప్రశ్నలు కూడా ఎదురవుతున్నాయి. కానీ, ఇప్పటి వరకు బీజేపీ నాయకులు కానీ.. ఎంపీలు కానీ.. ఎవరూ స్పందించకపోవడం గమనార్హం. మరి ఈ వారంలో అయినా.. కదలిక ఉంటుందేమో చూడాలి.

# కమిటీల ఏర్పాటు.. ఉద్యోగినులకు తోడ్పాటు



వికారాబాద్ : ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వహించే మహిళా ఉద్యోగుల రక్షణకు సర్కారు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మొదటగా మున్సిపల్ కార్యాలయాల్లో లైంగిక వేధింపులకు అడ్డుకట్ట వేసేందుకు అంతర్గత కమిటీలను ఏర్పాటు చేయాలని పురపాలిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న పురపాలికలు ఆ దిశగా దృష్టి సారించాయి. పని ప్రదేశాల్లో మహిళా ఉద్యోగినులపై వేధింపులు కొనసాగుతున్నాయని, తగిన చర్యలు తీసుకోవాలని పలు స్వచ్ఛంద సంస్థలు, వామ పక్ష నాయకులు కూడా అధికారులకు విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా చాలా చోట్ల ఇదే విషయమై ఆరోపణలు రావడంతో రాష్ట్ర పురపాలిక శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. జిల్లా కేంద్రంలో కమిటీ ఏర్పాటు చేయగా, తాండూరు, పరిగి, కొడంగల్‌లో త్వరలో ఏర్పాటు చేయనున్నారు. గతంలో అనేక సార్లు జిల్లాలో సంఘటనలు జరిగినా బయటకు రాకుండా చేశారు. ఇకపై ఉద్యోగినులను వేధిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇలాంటి విషయాలను ఊపేక్షించవద్దని స్పష్టం చేశారు. ఉత్తర్వులు ఏప్రిల్‌లో జారీ అయినా, లోక్‌సభ ఎన్నికల ప్రక్రియలో అధికారులు నిమగ్నమై ఉన్నందున వీటి ఏర్పాటుపై దృష్టి సారించలేదు. పోలింగ్ ముగియడంతో కమిటీల ఏర్పాటుపై కమిషనర్లు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలోని నాలుగు పురపాలికల్లో వివిధ హోదాల్లో మహిళా ఉద్యోగులు, కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు.

నియామకం ఇలా: పురపాలికల్లో విధులు నిర్వహించే మహిళకు రక్షణ కల్పించేందుకు 2013లో వచ్చిన చట్టాన్ని పరిగణనలోకి తీసుకుని కమిటీలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. కమిటీకి సీనియర్ మహిళా ఉద్యోగినిని ప్రిసైడింగ్ అధికారిగా నియమించాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. వారు లేకపోతే ఇతర ప్రభుత్వ కార్యాలయాల వారికి బాధ్యతలు అప్పగించాలని సూచించింది. అధికారితోపాటు మరో ఇద్దరిని సభ్యులుగా నియమిస్తారు. వీరికి మహిళా చట్టాలపై అవగాహన, సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న అనుభవం ఉండాలి. సమస్యలపై పోరాటం చేసే ప్రైవేట్ వ్యక్తులకు అవకాశం కల్పించాలని అధికారులు ఉత్తర్వులో పేర్కొన్నారు. ఉద్యోగినులపై ఎవరైనా వేధింపులకు పాల్పడితే కమిటీ విచారించి ఉన్నతాధికారులకు పూర్తి నివేదికను సమర్పించి బాధ్యులపై చర్యలు తీసుకునేలా తోడ్పాటు అందిస్తుంది. వీటి ఏర్పాటుతో రక్షణ లభిస్తుందని పలు మహిళా సంఘాలు ఆశిస్తున్నాయి. వికారాబాద్ పురపాలికలో ముగ్గురు మహిళా ఉద్యోగినులతో కమిటీ ఏర్పాటు చేశామని వికారాబాద్ మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ తెలిపారు. పని ప్రదేశంలో వేధింపులకు గురి చేస్తే దర్యాప్తు చేసి నివేదిక సమర్పించాల్సి ఉంటుందన్నారు.

# రక్తశుద్ధి.. ఆరోగ్య సిద్ధి



తాండూరు : మూత్రపిండాల వ్యాధిగ్రస్థులకు సాంత్వన చేకూర్చేందుకు ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా నాలుగు సర్కార్ దవాఖానాల్లో డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. కార్పొరేట్ స్థాయిలో ఆధునిక వసతులు కల్పించి వైద్య సేవలను అందుబాటులోకి తేవడంతో బాధితులకు హైదరాబాద్ వెళ్లే అవస్థలు తప్పాయి. స్థానికంగా ఉచిత సేవలు అందడంతో వారికి ఊరట కలిగింది. అయితే కొన్ని చోట్ల వసతులు సరిగా లేవని పూర్తిస్థాయిలో కల్పించాలని వారు కోరుతున్నారు. తాండూరు జిల్లా ఆసుపత్రి, వికారాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, పరిగి, కొడంగల్ సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో రక్తశుద్ధి సేవలను అందిస్తున్నారు. వికారాబాద్‌లో 2018 జనవరిలో సేవలు ప్రారంభించడంతో వికారాబాద్ పరిసర మండలాలతో పాటు, ఇతర మండలాలకు చెందిన వారు ఇక్కడ చికిత్స పొందుతున్నారు. పరిగి కేంద్రంలో కుల్కచర్ల, దోమ, పూడూరు మండలాల వారు, తాండూరు, కొడంగల్‌లో ఆ పరిసర గ్రామాల వారు కేంద్రాలను వినియోగించుంటున్నారు. కొడంగల్ కేంద్రంలో ఫర్నిచర్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మందులను బయట తెచ్చుకోమ్మని అక్కడి సిబ్బంది సూచిస్తున్నారని రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 23 పడకలు: తాండూరులో 8, వికారాబాద్, పరిగి, కొడంగల్ కేంద్రాల్లో 5 చొప్పున పడకలున్నాయి. తాండూరు 50, వికారాబాద్ 40, పరిగి 30, కొడంగల్ 35 మందికి సేవలు అందుతున్నాయి. పడకల ప్రకారం రక్తశుద్ధి చేస్తున్నారు. ఒక్కొక్కరికి నాలుగు గంటల పాటు సేవలందిస్తున్నారు. మందులు ఉచితంగా సరఫరా చేస్తున్నారు.

అంతా అధునాతనమే: డయాలేజర్‌ను మామూలుగా రోగికి 12, 13 సార్లు వినియోగిస్తారు. ప్రతి రోగికి ఒక పరికరాన్ని వినియోగించేలా జర్మనీ సంస్థ ప్రతినిధులతో ఒప్పందం చేసుకున్నారు. ఈ అధునాతనమైన విధానం కేవలం ప్రభుత్వ ఆస్పత్రిలోనే అందుబాటులో ఉంది. గతంలో వైద్యానికి నగరానికి వెళ్లిన ప్రతి సారి ఒక్కరికి అన్ని ఖర్చులు కనీసం రూ.10 వేల నుంచిరూ.15 వేల వరకు అయ్యేది. ఇప్పుడా పరిస్థితి తప్పింది.

పింఛన్ సౌకర్యం: రక్తశుద్ధి చేయించుకునే వారికి నెలకు రూ.2016 పింఛన్ అందుకుంటున్నారు. నాలుగు కేంద్రాల్లోని చికిత్స పొందుతున్న వారికి ఇది వర్తిస్తుంది. డయాలసిస్ చేసుకుంటున్నట్లు ధ్రువపత్రంతో దరఖాస్తు చేసుకుంటే పింఛన్ మంజూరు చేస్తారు.

40 మందికి సేవలందిస్తున్నాం- మహ్మద్ రిజ్వాన్, ఇన్‌ఛార్జి, వికారాబాద్

ఈ కేంద్రంలో ప్రస్తుతం 40 మందికి రక్తశుద్ధి చేస్తున్నాం. ఒక్కొక్కరికి నెలకు 12 సార్లు సేవలు అందించాల్సి ఉంటుంది. వికారాబాద్ పరిసర మండలాలకు చెందినవారు, స్థానికులు ఇక్కడికి వస్తున్నారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉంటే చికిత్స చేస్తున్నాం. ముందుగా పేరు నమోదు చేసుకుని దరఖాస్తు చేసుకోవాలి. ప్రతి రోగికి నెలకు నాలుగు ఇంజక్షన్లు ఇస్తాం. అంతే కాకుండా ఇనుముకు సంబంధించినవి రెండు ఇస్తాం.

పింఛన్ రావడం లేదు: జ్ఞానేశ్వర్, ధన్నారం

జనవరి నుంచి పింఛన్ రావడం లేదు. ఎందుకు నిలిపివేశారో తెలియడం లేదు. 2021 నుంచి చికిత్స చేయించుకుంటున్నా. వికారాబాద్‌లో కేంద్రం ఏర్పాటుతో రోగులకు సౌకర్యంగా మారింది.

సేవలు బాగున్నాయి

– ఎల్లయ్య, బూచన్‌పల్లి, మర్పల్లి

వికారాబాద్ కేంద్రంలో సేవలు బాగున్నాయి. ఆరు నెలలుగా చికిత్స పొందుతున్నా. పింఛన్ ఇస్తారన్న విషయం ఇప్పుడే తెలిసింది. దరఖాస్తు చేస్తా. ప్రభుత్వ దవాఖానాలో సేవలు అందించడం మంచి పరిణామం.

# పాత ఇళ్ల పై నిర్లక్ష్యం వద్దు

హైదరాబాద్: నగరానికి నాలుగు వందల ఏళ్ల చరిత్ర ఉంది. ఏళ్ల నాటి కట్టడాలు నగరంలో కనిపిస్తుంటాయి. వర్షాకాలం మొదలవడంతో వాటి పరిస్థితి ఎలా ఉందనే విషయంపై జీహెచ్‌ఎంసీ దృష్టి పెట్టింది. నగరవ్యాప్తంగా సర్వే చేపట్టింది. 459 శిథిల భవనాలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. కూలేందుకు సిద్ధంగా ఉన్నవి, మరమ్మతులతో కాపాడుకోగలిగినవి వంటి పలు విభాగాలుగా విభజించి తగు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ రోనాల్డ్‌రాస్ తెలిపారు. జీహెచ్‌ఎంసీ గుర్తించిన శిథిల భవనాల్లో సగం మేర మట్టిగోడలతో కట్టిన పెంకుటిళ్లు రేకుల షెడ్లు, గుడిసెలు ఉండగా.. మరో సగం రాతి కట్టడాలు, పాత కాలం నాటి బంగ్లాలు ఉన్నాయి. మట్టి గోడలతో ఉన్న నిర్మాణాలు ఎప్పటికైనా ప్రమాదమేనని, వాటిని కూల్చి కొత్త భవనాలను నిర్మించుకోవడం ఉత్తమమని ఇంజినీర్లు సూచిస్తున్నారు. రాతి గోడలు, ఉక్కు దిమ్మెలతో నిర్మించిన భవనాలను మాత్రం.. ఇంజినీర్ల సూచనతో కొత్తగా తీర్చిదిద్దుకోవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. గోడల పటిష్టతను శాస్త్రీయంగా పరీక్షించాక, వాటి నాణ్యత ఆశాజనకంగా ఉన్నప్పుడు.. పాత పైకప్పును తొలగించి, బంగ్లాకు పూర్వ వైభవం తీసుకొచ్చే చర్యలు చేపట్టవచ్చని స్పష్టం చేస్తున్నారు.

గుర్తించిన వాటిలో..జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో 459 శిథిల భవనాలను గుర్తించగా, గతేడాది బల్దియా పరిధిలో 231 శిథిల భవనాలను కూల్చివేశామని, 294 భవనాలకు మరమ్మతులు జరిపించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ ఏడాది కూడా ప్రమాదకరంగా ఉన్న భవనాలపై దృష్టి పెట్టామని, కూల్చక



తప్పదనుకున్న వాటిని ఇంజినీరింగ్ నిపుణుల సూచన మేరకు నేలమట్టం చేస్తున్నామని, కొన్నింటికి మరమ్మతులు చేసుకునేలా యజమానులకు అవకాశం ఇవ్వడం, మరికొన్నింటికి తాళం వేయడం, ఇతరత్రా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రణాళికా విభాగం తెలిపింది. పౌరులు సైతం 040-2111 1111కు ఫోన్ చేసి వర్షాకాలం కూలే అవకాశమున్న నిర్మాణాల గురించి సమాచారం ఇవ్వొచ్చని జీహెచ్‌ఎంసీ తెలిపింది.

## నేడు నల్సార్ లో వనమహోత్సవ కార్యక్రమం


శామీర్ పేట, (గరుడ వార్త) : నేడు నల్సార్ లో వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ విద్యుల్లతరెడ్డి బుధవారం తెలిపారు. మండల కేంద్రం శామీర్ పేట నల్సార్ విశ్వవిద్యాలయంలో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవ కార్యక్రమాన్ని గురువారము ఉదయం 11 గంటలకు వై ఛాన్సర్ శ్రీకృష్ణదేవరావ్ ఆధ్వర్యంలో వనమహోత్సవం లో భాగంగా మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. విద్యార్థులతో పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

## ఊరూరా ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు

శామీర్ పేట, (గరుడ వార్త) : పూర్వ ఉమ్మడి శామీర్ పేట మండలంలో తొలి ఏకాదశి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. బుధవారం ఉదయం తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు ఆయా గ్రామాల్లోని ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అత్యంత భక్తిశ్రద్ధలతో స్వామివార్లకు పూజలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తులు ఉపవాస దీక్షలను చేపట్టి సాయంత్రం విరమించారు. మహిళలు వాయినాలను ఇచ్చిపుచ్చుకున్నారు.

## గ్యాస్ లీక్ అయి ప్రమాదవశాత్తు చెలరేగిన మంటలు ఒకరికి గాయాలు

శామీర్ పేట, (గరుడ వార్త) : గ్యాస్ లీకై ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి ఒకరికి గాయాలైన సంఘటన అద్రాస్ పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. మూడు చింతలపల్లి మండలం అద్రాస్ పల్లిలో ప్రమాదవశాత్తు గ్యాస్ లీకేజీ కారణంగా సిలిండర్‌కు మంటలు అంటుకున్నాయి. గ్రామానికి చెందిన నారని కుమార్ కూతురు బుధవా




రం ఉదయం టీ పెట్టడానికి గ్యాస్ వెలిగించింది. ఒక్క సారిగా మంటలు చెలరేగడంతో కుమార్ కూతురుకు స్వల్ప గాయాలు అయ్యాయి. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు తన కూతుర్ని వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఇది గమనించిన స్థానికులు సిలిండర్ కు అంటుకున్న మంటలను ఇసుక, నీరు పోసి అదుపులోకి తెచ్చారు. సకాలంలో మంటలు ఆర్పేయడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు. వంట గదిలోని సామగ్రి పూర్తిగా దగ్ధం అయిందని స్థానికులు తెలిపారు.

# ఎంఎన్‌జేలో ట్విన్ టవర్లు!

హైదరాబాద్: నగరంలోని ప్రభుత్వ క్యాన్సర్ ఆసుపత్రి ఎంఎన్‌జేను విస్తరించనున్నారు. ప్రస్తుత ఆసుపత్రి వెనుక భాగంలో ఉన్న స్థలంలో ట్విన్ టవర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధంచేశారు. మొత్తం రూ.110 కోట్లతో కొత్త భవనాలు నిర్మించనున్నారు. ఫలితంగా అదనంగా 500 పడకలు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం ఆసుపత్రిలో 750 పడకలున్నాయి. ఏటేటా రోగుల సంఖ్య పెరుగుతోంది. ఎంఎన్‌జేలో అధునాతన సేవలు కూడా అందుబాటులోకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో అదనపు పడకల అవసరం ఏర్పడుతోంది. ప్రభుత్వం నుంచి లేదా సీఎస్‌ఆర్ కింద వివిధ ప్రైవేటు సంస్థలు కూడా అదనపు భవనాలు నిర్మించేందుకు సంసిద్ధత వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే కొత్త భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు.

రూ.30 కోట్లతో ట్రూబీమ్ థెరపీ




రేడియేషన్ చికిత్సల్లో అత్యాధునికమైన ట్రూబీమ్ థెరపీ సేవలు సైతం ఎంఎన్‌జేలో అందుబాటులోకి వచ్చాయి. ఇటీవలి రూ.30 కోట్లతో ఈ-రేడియేషన్ యంత్రాన్ని ప్రారంభించారు. ట్రూబీమ్‌తో క్యాన్సర్ కణితిని మాత్రమే కచ్చితమైన లక్ష్యంతో లోతుగా ధ్వంసంచేస్తాయి. ఎంఎన్‌జేలో ఈ చికిత్సలు పూర్తి ఉచితంగా అందిస్తుండటంతో రోగులకు ఎంతో ఊరట కలుగుతుందని, మున్ముందు మరిన్ని చికిత్సలు అందుబాటులోకి రానున్నాయని ఎంఎన్‌జే డైరెక్టర్ ముత్తా శ్రీనివాసులు తెలిపారు.

ఆసుపత్రి స్వరూపం...

ప్రస్తుతం ఆసుపత్రిలో పడకల సంఖ్య : 750
ఏటా కొత్త క్యాన్సర్ కేసుల నమోదు: 15,000
సమీక్షకు వచ్చే కేసులు: 1,50,000
ఏటా మేజర్ సర్జరీలు: 4500
మైనర్ శస్త్ర చికిత్సలు: 6000
రోజూ రేడియోథెరపీ చికిత్సలు: 300
నిత్యం కీమో థెరపీ చికిత్సలు: 300
ఏటా వివిధ రకాల టెస్టులు: 1.5 లక్షలు

# వానాకాలం.. అప్రమత్తతే ఆయుధం..!

భానుపురి : వానాకాలంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా విద్యుత్తు ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది. అందుకే అప్రమత్తత చాలా అవసరం. అజాగ్రత్తగా ఉంటే ప్రాణాలు గాలిలో కలుస్తాయి. గాలి దుమారం, భారీ వర్షాలు కురిసిన సమయంలో కరెంటు తీగలు తెగిపడతాయి. వాటిని గమనించకుండా వెళ్తే ప్రాణాపాయం సంభవిస్తుంది. కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ఈ ముప్పును అధిగమించొచ్చు. వానాకాలంలో గృహ వినియోగదారులతోపాటు రైతులు విద్యుత్తు పరికరాలకు దూరంగా ఉంటే మంచింది.

బోరుమోటార్ల వద్ద..

భువనగిరి జిల్లాల్లో ఎక్కువ వ్యవసాయ బావులు, ఇళ్లల్లో విద్యుత్తు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధానంగా బోరుబావుల వద్ద స్టార్టర్ల తీగలు అస్తవ్యస్తంగా ఉంటాయి. వాటి నిర్వహణ సరిగా లేక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మోటార్లు ఆన్‌చేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలి. తెగిపోయి వేలాడే తీగలను ముందే గుర్తించాలి. స్టార్టర్ డబ్బా వద్ద తీగలను సరిచేసుకోవాలి. ఫ్యూజులను తరచూ పరిశీలించాలి. వర్షం కురుస్తున్నప్పుడు బోరు ఆన్ చేయకుండా ఉండటమే ఉత్తమం. కాళ్లకు రబ్బరు చెప్పులు, చేతి తొడుగులు తప్పక ధరించాలి. స్టార్టర్ బాక్సులోకి విషసర్పాలు, ఎలకలు చేరి తీగలు కొరికేస్తాయి. వాటిని గమనించకుండా రైతులు ఆన్‌చేస్తే విద్యుదాఘాతం సంభవించే ఆస్కారం ఉంది. తడి చేతులతో స్తంభాలు, తీగలను పట్టుకోవద్దు. ఫైబర్ స్టార్టర్ డబ్బా వినియోగిస్తే మేలు.



జాగ్రత్తలు తప్పనిసరి

శ్రీనివాస్, డిస్కం డీఈ, సూర్యాపేట

వర్షాకాలంలో ప్రజలు విద్యుత్తు పరికరాలపై జాగ్రత్తలు పాటించాలి. ఎవరైనా వానలు కురిసిన సమయంలో కాళ్లకు రబ్బరు చెప్పులు వేసుకోవాలి. రైతులు మోటార్లు ఆన్‌చేసే సమయంలో చేతులకు ప్లాస్టిక్ తొడుగులు ధరించాలి.

ఇవి పాటిస్తే చాలు వర్షాకాలంలో విద్యుత్తు స్తంభాలకు కరెంటు ప్రసరణ జరిగే అవకాశం ఉంటుంది, వాటిని ఎవరూ తాకొద్దు.

వర్షాలు కురుస్తున్నప్పుడు ఇంట్లోని జీఐ తీగలతో కట్టిన దండేనికి దుస్తులు ఆరేస్తుంటారు. కొన్నిసార్లు వాటికి కరెంటు ప్రసరించే అవకాశం ఉంది. వాటిని ఒకసారి పరిశీలించాలి. ఎక్కడైౖ కరెంటు తీగలు తాకాయో చూడాలి. ఆ తర్వాత దుస్తులు ఆరేసుకోవాలి.

విద్యుత్తు నియంత్రికల నుంచి మంటలు వచ్చినప్పుడు, తీగలు తెగినప్పుడు సొంతంగా మరమ్మతులు చేసుకోవద్దు. సంబంధిత విద్యుత్తు అధికారులకు సమాచారం ఇవ్వాలి.కొన్ని నియంత్రికలకు చుట్టూ రక్షణ కంచెలు ఉండటం లేదు. వాటికి చాలా దూరంగా ఉండాలి. పశువులు వాటి వద్దకు వెళ్లకుండా జాగ్రత్త వహించాలి.

వ్యవసాయ క్షేత్రాల్లో పనిచేసే సమయంలో ఉరుములు, మెరుపులు వచ్చినప్పుడు చరవాణి స్విచ్ ఆఫ్ చేసుకోవాలి. చెట్ల కిందికి చేరొద్దు. తీగల కింద ఉండొద్దు.రైతులు, కూలీలు పొలాల ఒడ్డుగట్టున వెళ్లే సమయంలో చేతికర్ర వినియోగించాలి.

# రుణమాఫీ అమలుకు కసరత్తు

నల్గొండ : రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీకి కసరత్తు చేస్తోంది. ఇందుకు ఉమ్మడి నల్గొండ జిల్లా సహకార సంఘాల పరిధిలో రూ. 2 లక్షల లోపు పంట రుణం తీసుకున్న రైతుల వివరాలను అధికారులు సేకరించారు. ఆయా బ్యాంకుల రికార్డుల ఆధారంగా అర్హులైన రైతుల వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. ఉమ్మడి జిల్లాలో 5.36 లక్షల మంది రైతులు పంట రుణమాఫీ పొందే అవకాశం ఉంది. ఇందుకు ప్రభుత్వానికి రూ.7500 కోట్లు మేర నిధులు అవసరమవుతాయని సంబంధిత శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఆగస్టు 15వ తేదీలోగా రూ.2 లక్షల పంట రుణాన్ని మాఫీ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9 వరకు తీసుకున్న పంట రుణాలను మాఫీ చేసేందుకు జిల్లా యంత్రాంగం ఇప్పటికే కసరత్తు పూర్తి చేసింది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలోని ఆరు సహకార సంఘాల పరిధిలో డీసీసీబీ బ్యాంకుల ద్వారా రూ.2 లక్షల లోపు పంట రుణాలు తీసుకున్న రైతుల వివరాలను సేకరించేందుకు ఇటీవల సహకార శాఖ అధికారులు, క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు. ఆ వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదు చేశారు.

క్షేత్రస్థాయిలో సర్వే నల్గొండ జిల్లాలో నిడమనూరు, దేవరకొండ, సూర్యాపేట




జిల్లాలో కోదాడ, తిమ్మాపూర్, యాదాద్రి భువనగిరి జిల్లాలో చందుపట్లతోపాటు మరో సంఘం పరిధిలో క్షేత్రస్థాయిలో సర్వే కొనసాగింది. ఎంపిక చేసిన ఆయా సంఘంలో సహకార శాఖ కమిషనరేట్ నుంచి అందిన సమాచారం మేరకు 250 మంది రైతుల ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, తీసుకున్న రుణం వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. రుణం తీసుకున్న రైతుల ఖాతాలు నిజమైనవా కావా అని కూడా నిర్ధారించుకున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇలా ఎంపిక చేసిన సంఘాల నుంచి మాత్రమే సమాచారం అడిగి సేకరించి యాప్‌లో నిక్షిప్తం చేసి ప్రభుత్వానికి పంపారు. రుణమాఫీపై కదలిక రావడంతో రైతుల్లో సంతోషం కనిపిస్తోంది.

ప్రత్యేక యాప్‌లో నమోదు చేశాం

కిరణ్‌కుమార్, డీసీవో, నల్గొండ

నల్గొండ జిల్లాలోని రెండు సహకార సంఘాల పరిధిలో ప్రభుత్వం ఆదేశాల మేరకు పంట రుణాలు తీసుకున్న రైతుల వివరాలు సేకరించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేశాం. ఈ వివరాలు నేరుగా ప్రభుత్వానికి వెళ్తాయి.

# సవరణ.. భారమే సేకరణ



హైదరాబాద్ : భూముల ధరలను సవరించేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ప్రభుత్వం పచ్చజెండా ఊపితే ఆగస్టు ఒకటి నుంచే పెరిగిన మార్కెట్ ధరలు అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. వాస్తవిక ధరలకు, మార్కెట్ ధరలకు చాలా వ్యత్యాసం ఉన్న నేపథ్యంలో భూముల ధరలను పెంచడం అవసరమే అయినా... ఇది సరైన సమయం కాదని రియల్ ఎస్టేట్ సంఘాలు అంటున్నాయి. పెరిగే ధరలు స్థిరాస్తి కొనుగోలు దారులకే కాదు సర్కారు మీద కూడా భారం పడనుంది. ధరలు పెరిగితే భూ సేకరణ వ్యయం పెరిగి మెట్రో రెండోదశ ప్రాజెక్ట్ అంచనాలు భారీగా మారనున్నాయి. సిటీలో చేపట్టే ఇతర మౌలిక వసతుల ప్రాజెక్టల అంచనాలు పెరిగే అవకాశం ఉంది. ఈ దశలో సర్కారు ముందుకు వెళుతుందా? మరికొంత కాలం వేచిచూస్తుందా? అనేది పెద్ద ప్రశ్నగా ఉంది.

చివరి దశలో డీపీఆర్‌లు

మెట్రోరైలు ప్రస్తుతం మూడు కారిడార్లలో 69.2 కి.మీ. మార్గం అందుబాటులో ఉంది. పెరుగుతున్న ట్రాఫిక్, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా రెండోదశలో మరో 70 కి.మీ. మార్గం నిర్మించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించి కారిడార్లను ఎంపిక చేసింది. వీటికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక(డీపీఆర్)ను రూపొందించాలని మెట్రోరైలు అధికారులను ఆదేశించింది. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకుని తుది రూపు ఇచ్చే పనిలో డీపీఆర్ కన్సల్టెన్సీలు ఉన్నాయి. భూముల మార్కెట్ ధరలు పెంచితే ఆ మేరకు భూసేకరణ వ్యయ అంచనాలను పెంచాల్సి వస్తుంది.

తొలుత పాతబస్తీ ప్రాజెక్ట్‌పై

ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5 కి.మీ. మెట్రో నిర్మాణానికి కొద్దినెలల క్రితం సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. మొదట ఇరుకుగా ఉన్న రహదారులను విస్తరించాల్సి ఉంది. ఇందుకోసం సుమారు 1100 వరకు ఆస్తులు ఉన్నట్లు మెట్రో అధికారులు గుర్తించారు. కచ్చితంగా ఎంత మేరకు సేకరణ అవసరమనే డ్రాయింగ్‌పనులు జరుతున్నాయి. భూముల మార్కెట్ ధరలు సవరిస్తే ఆ ప్రభావం మొదట పాతబస్తీ మెట్రోపైనే ఉంటుంది. ప్రాజెక్ట్ నిర్మాణం, భూసేకరణకు కలిపి రూ.2వేల కోట్లు అవుతుందని మార్చిలో అధికారులు తెలిపారు. ఇది మరింత పెరిగే అవకాశం ఉంటుంది. భూముల ధరల సవరణతో ఆస్తులు కోల్పోయేవారికి మెరుగైన పరిహారం అందుతుందనే వాదనలు ఉన్నాయి.

మెట్రో కారిడార్లలో సేకరణ..

రాయదుర్గం నుంచి బయోడైవర్సిటీ, నానక్‌రాంగూడ కూడలి, విప్రోకూడలి మీదుగా అమెరికన్ కాన్సులేట్ వరకు 8 కి.మీ. మార్గంలోనూ ఆస్తులను సేకరించాల్సి ఉంటుంది.

మియాపూర్ – బీహెచ్‌ఈఎల్ – పటాన్‌చెరు మార్గంలో 14 కి.మీ. దూరం ఉంటుంది. పెద్దగా భూసేకరణ సమస్యలు లేవు.

ఎల్బీనగర్–హయత్‌నగర్ 7 కి.మీ. మార్గంలోనూ జాతీయ రహదారుల సంస్థ ఫ్లైఓవర్లతో అలైన్‌మెంట్ సవాళ్లున్నాయి. ఇలాంటి చోట కొన్ని ఆస్తులను సేకరించాల్సి ఉంటుంది. మార్కెట్ ధరలను సవరిస్తే ఆ మేరకు అంచనాలు పెరిగే అవకాశం ఉంది. సర్కారు పెంచిన తర్వాతే అంచనా వ్యయాల్లో పెరుగుదల ఎంతనేది స్పష్టత వస్తుందని అధికారులు అంటున్నారు. ఆలస్యం కారణంగా ఇప్పటికే పదేళ్లలో అంచనా వ్యయాలు ఎంతో పెరిగాయి. ధరల సవరణతో మరింత పెరిగే అవకాశం ఉంటుంది.

మిగతా 70 కి.మీ. మార్గంలోనూ...

రెండో దశలో విమానాశ్రయ మార్గం ఒకటి. నాగోల్ – ఎల్బీనగర్ కలుపుతూ.. అక్కడి నుంచి చంద్రాయణగుట్ట – మైలార్‌దేవ్‌పల్లి – పీ7 రోడ్ – శంషాబాద్ విమానాశ్రయం వరకు మెట్రోని నిర్మించనున్నారు. 29 కి.మీ. మార్గమిది. ఈకారిడార్‌లో నాగోల్ నుంచి సాగర్ రింగ్‌రోడ్డు వరకు పలు ఫ్లైఓవర్లు ఉండటంతో కొన్నిచోట్ల ఆస్తుల సేకరణ అనివార్యం. ఆ తర్వాత ఓవైసీ కూడలిలో, చంద్రాయణగుట్ట ప్రాంతంలో మెట్రో నిర్మాణానికి, జంక్షన్ స్టేషన్‌కు ఆస్తులు సేకరించాలి. ఫలక్‌నుమా నుంచి చంద్రాయణగుట్ట మార్గాన్ని కలపాల్సి ఉంటుంది.

# ఫాంహౌస్‌లో భూ మాఫియా దారుణాలెన్నో!



హైదరాబాద్ : యజమానిని బెదిరించి భూ కబ్జా.. అంతటితో ఆగకుండా అందులోనే అక్రమంగా ఫాంహౌస్ నిర్మాణం.. దాని చుట్టూ 20 అడుగుల ఎత్తులో గోడ.. చుట్టూ సీసీ కెమెరాలు.. లోపలికి వెళ్లగానే భీతిగొలిపేలా పదుల సంఖ్యలో కుక్కలు.. ఎవరైనా ఎదురు తిరిగితే కిడ్నాప్ చేసి చిత్రహింసలు పెట్టేందుకు అనువుగా హాకీ కర్రలు.. ఆయుధాలు.. ఇదీ ఓ భూ మాఫియా నిర్వహిస్తున్న ఫాంహౌస్‌లోని దృశ్యాలు.. నార్సింగిలో ఎమ్మార్పీఎస్ నాయకుడు నరేందర్ కిడ్నాప్ కేసు దర్యాప్తు చేస్తున్న కొద్దీ విస్తుపోయే విషయాలు బయటపడుతున్నాయి. ఈ కేసులో ఇప్పటికే నలుగుర్ని అరెస్టు చేసిన పోలీసులు.. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. నరేందర్‌ను నిందితులు కిడ్నాప్ చేసి రెండ్రోజులపాటు శంషాబాద్ ధర్మిగిరి ఆలయం సమీపంలోని 'బ్రదర్స్' పేరుతో నిర్మించిన ఫాంహౌస్‌లో బంధించినట్లు గుర్తించారు. పోలీసులు ఫాంహౌస్‌కు వెళ్లారు. అక్కడి పరిస్థితుల్ని చూసి విస్తుపోయారు. 20కిపైగా పెంపుడు శునకాలు, లోపల ఏం జరుగుతుందో తెలియకుండా ఎత్తైన గోడలు, చుట్టూ సీసీ కెమెరాలున్నట్లు గుర్తించారు. అసలు వివాదమిదీ.. నార్సింగిలోని బృందావన్ కాలనీలో వెయ్యి గజాల భూమికి సంబంధించి వివాదం నడుస్తోంది. దీన్ని కొందరు ఏపీలోని గుంటూరుకు చెందిన హరికృష్ణకు రూ.3 కోట్లకు అమ్మారు. దాన్ని చదును చేయించేందుకు సిద్ధమవుతున్న తరుణంలో పాత నేరస్థులతో కూడిన మాఫియా బలవంతంగా భూమిని ఆక్రమించారు. విషయం తెలుసుకున్న హరికృష్ణ.. నార్సింగికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకుడు నరేందర్‌ను అక్కడికి పంపించారు. ఈనెల 10న నరేందర్, స్నేహితుడు ప్రవీణ్‌తో కలిసి అక్కడికి వెళ్లారు. కొందరు అక్కడ ఉండటం చూసి ఎందుకిక్కడ ఉన్నారని ప్రశ్నించగా వారిని దుండగులు అపహరించారు. ఫాంహౌస్‌లో బంధించి రెండ్రోజులపాటు చిత్రహింసలు పెట్టారు. వేడినీళ్లు పోస్తూ చితకబాదారు.

కుక్కలతో కాపలా.. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం.. నిందితులు గతంలోనూ నేరాలు చేసినట్లు అనుమానిస్తున్నారు. అక్కడ కుక్కల్ని ఎందుకు పెంచుతున్నారో ఆరా తీస్తున్నారు. ఇంకోవైపు ఫాంహౌస్‌ను అనుమతి లేని ప్రాంతంలో నిర్మించినట్లు దర్యాప్తులో గుర్తించారు. పోలీసులు ఫాంహౌస్‌లో తనిఖీలు చేస్తున్న సమయంలో చార్మినార్‌కు చెందిన సక్సేనా కుటుంబం అక్కడికి చేరుకుంది. తమ భూమిని మీర్ అలీ కబ్జా చేసి ఫాంహౌస్ నిర్మించినట్లు వివరించారు. పోలీసులు వారిని ఆర్జీఐఏ ఠాణాలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

# ఉపాధి లేక.. వాయిదాలు చెల్లించలేక

గోదావరిఖని: నిర్వాసితుడి పేరు కదుదుల అనిల్. మధ్యమానేరు ముంపు గ్రామం నీలోజిపల్లి. జలాశయంలో ఇల్లు, ఎకరం వ్యవసాయ పొలం ముంపునకు గురయ్యాయి. ఇంటి నిర్మాణానికి రూ. 5.04 లక్షలు చెల్లిస్తామని గత ప్రభుత్వం తెలపడంతో పరిహారం వచ్చిన డబ్బులతోపాటు ఓ హౌసింగ్ ఫైనాన్స్ వద్ద అనిల్ తండ్రి రాజయ్య రూ.5 లక్షల రుణం తీసుకొని ఇల్లు నిర్మించుకున్నాడు. వ్యవసాయ భూమి ముంపునకు గురికావడంతో కొత్తపల్లి మండలం బావుపేటలోని ఓ క్రషర్‌లో అనిల్ కూలీకి వెళ్తున్నాడు. కొన్ని నెలలు వాయిదా సక్రమంగా చెల్లించాడు. క్రషర్‌లో పని లేకపోవడంతో వాయిదాలు చెల్లించకపోవడంతో హౌసింగ్ ఫైనాన్స్ వారు ఇల్లును తమ ఆధీనంలోకి తీసుకొన్నారు. అనిల్ కుటుంబం ఇతరుల వద్ద ఆశ్రయం పొందుతోంది. నిర్వాసితులకు హామీ ఇచ్చిన రూ. 5.04 లక్షలు ఇస్తే తనకు ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రాజరాజేశ్వర జలాశయ నిర్మాణంలో సర్వం కోల్పోయిన నిర్వాసితులకు నాయకులు ఇచ్చిన హామీ అమలు కాలేదు. ఇంటి నిర్మాణం కోసం రూ. 5.04 లక్షలు చెల్లిస్తామని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ వేములవాడ వచ్చిన సమయంలో నిర్వాసితులకు హామీ ఇచ్చి తరవాత సాధ్యం కాదని వెల్లడించారు. ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్, భాజపా, ఇతర పార్టీల నాయకులు నిర్వాసితుల పోరాటానికి మద్దతు ప్రకటించారు. నాడు నిర్వాసితుల పక్షాన పోరాడిన కాంగ్రెస్ రూ. 5.04 లక్షలు చెల్లిస్తామని హామీ ఇచ్చింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో ఈ డబ్బులు చెల్లించాలని నిర్వాసితులు డిమాండ్ చేస్తున్నారు.బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద 2006లో మధ్యమానేరు జలాశయ నిర్మాణంలో కొదురుపాక, నీలోజిపల్లి, వరదవెల్లి, శాభాష్‌పల్లి, రుద్రవరం, సంకెపల్లి, అనుపురం, కొడుముంజ, చింతల్‌ఠాణా, చీర్లవంచ, ఇల్లంతకుంట మండలం కందికట్కూరు అనుబంధ గ్రామం గుర్రంవాణిపల్లి గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ఆయా గ్రామాల్లో 10,683 కుటుంబాలు నిర్వాసితులుగా మారుతున్నట్లు అధికారులు గుర్తించారు. వీరికి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలు ఏర్పాటు చేసి ఒక్కొక్కరికి 242 చదరపు గజాల ఇంటి స్థల పట్టాలను అందజేశారు. విడతల వారీగా పరిహారం చెల్లించారు. నేటికీ కొంతమందికి ఇవ్వలేదు. అయితే నిర్వాసితులు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలకు వచ్చి ఇళ్లు నిర్మించుకొని ఉంటున్నారు. అయితే ఇళ్ల నిర్మాణం కోసం అనేక మంది నిర్వాసితులు బ్యాంకులు, హౌసింగ్ ఫైనాన్స్ సంస్థల నుంచి రుణాలు తీసుకొన్నారు. ప్రతి నెలా వాయిదా పద్ధతిలో వాటిని చెల్లిస్తున్నారు. వచ్చిన కొద్దిపాటి పరిహారం డబ్బులు అప్పులు చెల్లించడం, అవసరాలకు ఖర్చు కావడంతో కొంత మంది ఇళ్లు నిర్మించుకోలేదు.

రూ. 5.04 లక్షలు చెల్లిస్తే...

ముంపు గ్రామాల్లో వ్యవసాయం, కూలీ, ఇతర పనులు చేసుకొని జీవనం సాగించిన నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి వచ్చిన అనంతరం ఉపాధి కరవైంది. చేతిలో పనులు లేకపోవడంతో పట్టణ ప్రాంతాల్లో కూలీ పనులకు వెళ్తున్నారు. ఈక్రమంలో ఇళ్ల నిర్మాణాలకు తీసుకున్న రుణం చెల్లింపులో భాగంగా వాయిదాలు సక్రమంగా




చెల్లించలేక ఇబ్బందులు ఎదురవుతున్నట్లు వాపోతున్నారు. కొంత మంది నిర్వాసితులు వాయిదాలను చెల్లించలేకపోవడంతో రుణం ఇచ్చిన బ్యాంకు, హౌసింగ్ ఫైనాన్స్ సంస్థలు ఇళ్లను తమ ఆధీనంలోకి తీసుకొంటున్నాయి. ఇటువంటి తరుణంలో నిర్వాసితులకు ఉపాధి కల్పించడంతోపాటు రూ. 5.04 లక్షలు చెల్లిస్తే ఉపయోగంగా ఉంటుంది.

అధికారంలోకి వచ్చాక...

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిర్వాసితులు చేపట్టిన కార్యక్రమాలకు ప్రతిపక్ష పార్టీలు మద్దతు తెలిపాయి. ఎమ్మెల్యే, ఎంపీ హోదాల్లో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొని నిర్వాసితులకు మద్దతు ప్రకటించారు. నిర్వాసితులకు ఇచ్చిన హామీతోపాటు పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని అప్పటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాగా మధ్యమానేరు నిర్వాసితుల పెండింగ్ సమస్యలు పరిష్కరించడంతోపాటు నిర్వాసితులకు రూ.5.04 లక్షలు ఇప్పించే బాధ్యత తీసుకుంటామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రస్తుత వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంలు హామీ ఇచ్చారు. నిర్వాసితులందరికీ చెల్లించేందుకు సుమారు రూ.550 కోట్లు అవసరం ఉంటుందని అంచనా.

ప్రభుత్వం ఆదుకోవాలి

ముంపు గ్రామంలో ఆటో నడుపుకుంటూ జీవనం సాగించాను. ప్రస్తుతం వాటర్ ప్లాంట్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నాను. ఆర్థిక పరిస్థితుల వల్ల ఇంటి నిర్మాణం చేపట్టలేదు. రూ. 5.04 లక్షలు ప్రభుత్వం చెల్లిస్తే రేకుల షెడ్డు వేసుకుంటాను. ప్రభుత్వం స్పందించి నిర్వాసితులను ఆదుకోవాలి.

సట్ట వెంకటేశం, నిర్వాసితుడు, కొదురుపాక

ముఖ్యమంత్రిని కలిశాం

మధ్యమానేరు ముంపు నిర్వాసితులకు రూ. 5.04 లక్షలు చెల్లించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశాం. ప్రభుత్వం సానుకూలంగా ఉంది. రూ. 5.04 లక్షలు చెల్లిస్తారన్న విశ్వాసం ఉంది.

కూస రవీందర్, ముంపు గ్రామాల ఐక్యవేదిక అధ్యక్షుడు

# పల్లెల్లో విషజ్వరాల విజృంభణ

కోదాడ :మంచినీటి పైపులైన్ లీకేజీ కోసం తవ్వి వదిలేసింది. మునగాల మండలం తాడువాయి గ్రామంలోనిది. ఆ గుంతల్లో వర్షపు నీటితో పాటు, లీకేజీ నీరు కలవడంతో బురద ఏర్పడి ఆ ప్రాంతంలో దోమల వ్యాప్తి ఎక్కువైంది. నీరు సరఫరా కానప్పుడు ఈ మురుగు పైపులోకి వెళ్లి మంచినీటితో కలిసి ఇంటింటికీ సరఫరా అవుతోందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా గ్రామంలో జ్వర బాధితుల సంఖ్య 70కి పైగా పెరగడంతో వైద్య అధికారులు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.గ్రామాల్లో ఎక్కడ చూసినా జ్వర బాధితులే కనిపిస్తున్నారు. ఇంటికో మనిషి మంచాన పడ్డారు. పారిశుద్ధ్య లోపంతో పల్లెల్లో వర్షపు నీరు ఎక్కడపడితే అక్కడే నిలిచింది. ఫలితంగా దోమల వ్యాప్తి విపరీతంగా పెరిగి డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు, డయేరియా విజృంభిస్తోంది.

మచ్చుకు కొన్ని..నడిగూడెం మండలం తెల్లబెల్లి గ్రామంలో ఇంటికో మనిషి జ్వరాన పడ్డారు. దీంతో వైద్యాధికారులు గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి రక్త పరీక్షలు చేస్తున్నారు. అక్కడ కూడా దోమల వ్యాప్తే కారణమని అధికారులు చెబుతున్నారు.

మఠంపల్లి మండలం రఘునాథపాలెం గ్రామంలో డయేరియా కేసులు బయటపడ్డాయి. అధికారులు గ్రామంలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. నీటి కాలుష్యంతోనే ఈ కేసులు వస్తున్నాయని వైద్య సిబ్బంది తెలిపారు.హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని బూరుగడ్డ, లక్కవరం



గ్రామాల్లోనే 26కి పైగా డెంగీ కేసులు నమోదయ్యాయి. ఇవి ఆరోగ్య సిబ్బంది వద్ద పరీక్షలు చేయించినవి మాత్రమే. వీరు కాకుండా చాలా మంది పట్టణాల్లో చికిత్స పొందుతున్నారు. ఈ గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు.లింగగిరి పీహెచ్‌సీ పరిధిలోని బూరుగడ్డ, లక్కవరం గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు అధ్వానంగా ఉండటంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసి ఆ గ్రామాల పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేస్తామని హెచ్చరిం చడం గమనార్హం.

లెక్కలపై గోప్యత..

జిల్లాలో జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నా వైద్యాధికారులు కనీసం బాధితుల సమాచారం కూడా సేకరించట్లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటి వరకు డెంగీ, మలేరియా, విష జ్వరాల లెక్కలపై అధికారులు గోప్యత పాటిస్తున్నారు. లెక్కలు బయటకు వస్తే ఉన్నతాధికారుల నుంచి చీవాట్లు పడతాయన్న భయమో, సమాచారం లేకో తెలియని పరిస్థితి. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు డెంగీ కేసులు 53, మలేరియా ఒక కేసు నమోదుకు కాగా.. టైఫాయిడ్ కేసులు అసలే నమోదు కాలేదని అధికారులు చెప్పడం గమనార్హం.

జాగ్రత్తలు పాటిస్తే మేలు

కోటా చలం, డీఎంహెచ్‌వో, సూర్యాపేట

దోమల వ్యాప్తిని అరికట్టాల్సిన అవసరం ఉంది. పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగే దోమలు కుట్టకుండా జాగ్రత్త పాటిస్తేనే జ్వరాల బెడద తప్పుతుంది.

# రాయితీ దూరం.. సాగు భారం

నల్గొండ : వ్యవసాయంలో కూలీల కొరత తీవ్రంగా ఉండడంతో రైతులు యంత్రాలపై ఆధారపడుతున్నారు. అవి లేకుండా పనులు చేయడం ప్రస్తుతం కష్టతరంగా మారింది. దుక్కి దున్నడం మొదలుకొని పంటల కోతల వరకు యంత్రాలపైనే ఆధారపడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. గతంలో ప్రభుత్వం ద్వారా రాయితీపై వ్యవసాయ పరికరాలు అందేవి. గత ప్రభుత్వం 2018లో రైతుబంధు పథకం ప్రవేశపెట్టినప్పటి నుంచి యంత్ర పరికరాలు, విత్తనాలపై రాయితీలను నిలిపివేసింది. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గతంలో ట్రాక్టర్లు, రోటోవేటర్లు, కల్టివేటర్లు, స్ప్రేయర్లు, స్ప్రింకర్లు, పైపులు, టార్పాలిన్ కవర్లను సుమారు 50 శాతం రాయితీతో అందించేవారు. ప్రస్తుతం రైతులకు ఏ రకమైన పరికరాలు రాయితీతో అందడం లేదు. గతంలో ప్రభుత్వం అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో టార్పలిన్ కవర్లను అందించినా ప్రస్తుతం అవి లేకపోవడంతో రైతులు బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు.

ధరల్లో వ్యత్యాసం..ప్రభుత్వం రాయితీ ఎత్తివేయడంతో పలు వ్యవసాయ యంత్ర పరికరాల ధరలకు పెరిగిపోయాయి. కల్టివేటర్ ధర గతంలో రూ.30 వేలు ఉండగా ప్రస్తుతం రూ.45–50 వేల వరకు చేరింది.



రోటోవేటర్ గతంలో రూ.లక్ష వరకు ఉండగా ప్రస్తుతం రూ.1.5 లక్షల వరకు ఉంది. పైపులు, స్ప్రింక్లర్ల ధరలు సైతం రెండింతలు పెరిగి రైతులకు భారమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం సాగుకు అవసరమైన యంత్ర పరికరాలు రాయితీపై అందజేయాలని రైతులు కోరుకుంటున్నారు.ప్రభుత్వం చొరవ తీసుకోవాలి

కొర్ర క్రాంతికుమార్, రాజపేట, మర్రిగూడ

కల్టివేటర్లు, రోటోవేటర్లు ప్రభుత్వం రాయితీపై అందిస్తే రైతులకు మేలు జరుగుతుంది. వ్యవసాయ యంత్రాలపై ప్రభుత్వం రాయితీ అందించకపోవడంతో ఇటీవల అప్పుచేసి కల్టివేటరు రూ.42 వేలకు, రోటోవేటరు రూ.1.25 లక్షలు వెచ్చించి కొనుగోలు చేశాను. ప్రభుత్వం రాయితీ అందిస్తే ఉంటే సుమారు రూ.40 వేల వరకు ఆదా అయ్యేవి.

ఎటువంటి ఆదేశాలు రాలేదు

ఏడీఏ ఎల్లయ్య, మునుగోడు

2018 కంటే ముందు విత్తనాలు, వ్యవసాయానికి ఉపయోగపడే ట్రాక్టర్లు, కల్టివేటర్లు, రోటోవేటర్లు రాయితీపై అందించిన మాట వాస్తవమే. ప్రస్తుతం రాయితీ పరికరాలపై ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు లేవు. ప్రభుత్వ నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటాం.




## మీ పని పూర్తయిన వెంటనే సిస్టమ్స్ లాగౌట్ చేస్తారా..?: ప్రశ్నించిన మోదీ

దిల్లీ: డిజిటల్ ప్రపంచంలో జీవిస్తోన్న మనం నిత్యం హ్యాకింగ్, సైబర్ మోసాలు, వైరస్ దాడుల గురించి వింటున్నాం. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ అధికారులకు ఓ సూచన చేశారు. పని పూర్తయిన వెంటనే సిస్టమ్స్ లాగౌట్ చేయాలని చెప్పినట్లు ఓ జాతీయ మీడియా కథనం వెల్లడించింది. "రోజూ పని పూర్తయిన వెంటనే మీ సిస్టమ్స్ లాగౌట్ చేస్తారా..? నేను చేస్తాను. సైబర్ భద్రత విషయంలో ఇది చాలా ముఖ్యం" అని మోదీ హెచ్చరించారు. రోజు చివర్లో అన్ని సిస్టమ్స్ లాగౌట్ అయ్యాయా..?లేదా..? చూసుకొనే పనిని ప్రతీ ఆఫీస్‌లో ఒక వ్యక్తికి అప్పగించాలంటూ సూచించారు. ఇంటికి వెళ్లేప్పుడు తన సిస్టమ్‌ను తానే లాగౌట్ చేసుకుంటానని చెప్పారు. వాటిని ఓపెన్ చేసి ఉంచటం వల్ల సైబర్ దాడుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని అధికారులతో అన్నారు. ఇటీవల సీనియర్ బ్యూరోక్రాట్లతో జరిగిన సమావేశంలో ప్రధాని ఈ హెచ్చరికలు చేశారు. ఈ మార్చిలో ప్రధాని మోదీతో మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ 'చాయ్ పే చర్చ'లో పాల్గొన్న సంగతి తెలిసిందే. ఆ సందర్భంగా తాను గేట్స్‌తో సైబర్ భద్రత గురించి చర్చించినట్లు చెప్పారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ వ్యవస్థలు సైబర్ దాడులకు గురైన నేపథ్యంలో సైబర్ భద్రత కేంద్ర ప్రభుత్వానికి కీలకాంశంగా మారింది. ఇక ఈ సమావేశం అనంతరం కేబినెట్ సెక్రటరీ ఆ దిశగా బ్యూరోక్రాట్లకు రాతపూర్వక ఆదేశాలు ఇచ్చారు. 'చాయ్ పే చర్చ'లో మోదీ, గేట్స్ డిజిటల్ టెక్నాలజీ గురించి చర్చించుకున్న సంగతి తెలిసిందే. ఈసందర్భంగా మోదీ మాట్లాడుతూ.."సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి నేను ఇష్టపడతా. కొత్త విషయాలను తెలుసుకోవడానికి చాలా ఉత్సుకతతో ఉంటా. మా అధ్యక్షతన జరిగిన జీ20 సదస్సులో ఏఐ టెక్నాలజీని వినియోగించుకున్నాం. ఏఐ శక్తిమంతమైనదే. కానీ.. దాన్ని మ్యాజిక్ టూల్‌గా ఉపయోగిస్తే అది తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది. సరైన శిక్షణ లేకుండా దీన్ని ఉపయోగిస్తే దుర్వినియోగమయ్యే ప్రమాదం ఉంది. తప్పుడు వ్యక్తుల చేతుల్లో పడితే వక్రమార్గంలో పయనిస్తుంది. భారత్ లాంటి ప్రజాస్వామ్య దేశంలో డీప్‌ఫేక్‌ను ఎవరైనా వినియోగించొచ్చు. డీప్‌ఫేక్‌తో నా గొంతును కూడా అనుకరించారు" అని వెల్లడించిన సంగతి తెలిసిందే.

## ఏపీలో మూడు చోట్ల కొత్త విమానాశ్రయాలు: పురందేశ్వరి



అమరావతి: కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీయే అధికారంలో ఉండటంతో ఏపీలో అభివృద్ధి కార్యక్రమాలు ఊపందుకున్నాయని భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి తెలిపారు. ఈ మేరకు ఆమె ఎక్స్(ట్విటర్) వేదికగా పోస్టు చేశారు. చిత్తూరు జిల్లా కుప్పం, శ్రీపొట్టి శ్రీరాములు జిల్లా దగదర్తి, శ్రీకాకుళం జిల్లా మూలపేటలో కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు చేయగలుగుతున్నామన్నారు. అభివృద్ధి, కనెక్టివిటీ పెంపుతో పాటు ఆర్థిక పురోగతికి కూడా ప్రోత్సాహం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు సీఎం చంద్రబాబు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చిన్న ఎయిర్‌పోర్టులు తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో భోగాపురం విమానాశ్రయ పనుల్లో వేగం పెరిగింది. సీఎం ఇటీవల అక్కడ పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు.

## అధికారిక నివాసంలో పూజలు.. పాల్గొన్న సీఎం చంద్రబాబు..




న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటను రెండో రోజు బుధవారం కొనసాగుతోంది. ఢిల్లీలోని సీఎం అధికారిక నివాసం వన్ జనపథ్ లో జరుగుతున్న పూజా కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొని గృహప్రవేశం చేశారు. అనంతరం ఆయన విజయవాడ బయలుదేరనున్నారు. నిన్న (మంగళవారం) సాయంత్రం ఢిల్లీకి చేరుకున్న చంద్రబాబు కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సమావేశం అయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు.

**అమిత్ షాతో చంద్రబాబు భేటీ :** కాగా కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం రాత్రి ఢిల్లీలో సమావేశమయ్యారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తిరిగి పట్టాలెక్కించేందుకు కేంద్రం, రాష్ట్రం అనుసరించాల్సిన ప్రణాళిక సహా అనేక అంశాలపై విస్తృతంగా చర్చించారు. రాత్రి 9.30 గంటల నుంచి 10.30 వరకు జరిగిన చర్చల్లో రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించి తమ ప్రభుత్వ ప్రాథమ్యాలు, ప్రాధాన్యాలను షా దృష్టికి చంద్రబాబు తీసుకెళ్లారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి సంబంధించి పొందుపరచాల్సిన అంశాలతో పాటు తక్షణం అవసరమైన నిధులు, మంజూరు చేయాల్సిన ప్రాజెక్టుల గురించి ప్రస్తావించినట్లు సమాచారం. రాష్ట్ర దుర్భర ఆర్థిక పరిస్థితి, గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వ నిర్ణయాలతో పరిస్థితులు ఎంత దిగజారాయో వివరించారు. జగన్ పాలనలో ఆర్థిక అసమర్థత, ఆర్థిక నిర్వహణలో తీవ్ర వైఫల్యం, విచ్చలవిడి అవినీతి వల్ల రాష్ట్రానికి ఎనలేని నష్టం జరిగిందని అమిత్ షాకు చెప్పినట్లు ఆ తర్వాత చంద్రబాబు విలేకరులకు తెలిపారు. ఎన్డీయేకి ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడినపెట్టేందుకు, ఎకానమీ కోలుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర ప్రణాళికను రూపొందిస్తాయని చెప్పారు. 2019%-%24 మధ్య అలవిమాలిన విధంగా పెరిగిపోయిన రుణాలు, తద్వారా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అదుపు తప్పడంపై తాను నాలుగు శ్వేతపత్రాలను విడుదల చేశానని తెలిపారు. అనంతరం కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు టీడీపీ ఎంపీలతో చర్చించారు.

## భూ హక్కు చట్టం రద్దును స్వాగతిస్తున్నాం



గుంటూరు: భూ హక్కు చట్టం రద్దును స్వాగతిస్తున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. గత ప్రభుత్వం మొండి వైఖరితో భూ హక్కు చట్టాన్ని తెచ్చిందన్నారు. ఉచిత ఇసుక వల్ల స్థానిక నాయకులు, మంత్రులు జోక్యం చేసుకుని చెడ్డ పేరు తెచుకోవద్దని సూచించారు. వైజాగ్ భీమిలిలో ఎర్రమట్టి దిబ్బలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వైసీపీ పాలనలో 1.75 లక్షల భూములు అన్యాక్రాంతం అయ్యాయన్నారు. కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఢిల్లీ ప్రయాణం మంచిదేనని సీపీఐ రామకృష్ణ వ్యాఖ్యానించారు. జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని రామకృష్ణ విమర్శించారు. రాష్ట్రాన్ని ఆర్థిక అధోగతిని నుంచి బయట పడేయాలన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం సీఎం కేంద్రంపై ఒత్తిడి చెయ్యాలన్నారు. బీహార్ సీఎం ప్రత్యేక హోదా కోరుతున్నారన్నారు. విభజన హామీ అమలు, ప్రత్యేక హోదా అమలు కావాల్సిన అవసరం ఉందన్నారు. నిధులు లేకుంటే రాష్ట్రంలో ప్రాజెక్ట్‌లు, రోడ్లు ఎలా కడతారని ప్రశ్నించారు. పోలవరంలో అవకతవకలు జరిగితే సరిదిద్ది ప్రాజెక్ట్ పూర్తి చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి నిర్వాసితులకు న్యాయం జరిగేలా చేస్తామన్నారు. అమరావతితో పాటు పోలవరం కూడా పూర్తి చెయ్యాలని రామకృష్ణ పేర్కొన్నారు.

## రోజాతో సెల్ఫీ అడిగిన పారిశుద్ధ్య కార్మికులు.. దూరంగా నిల్చోవాలన్న మాజీ మంత్రి

### దూరంగా నిల్చోమని చేయి చూపుతున్న రోజా, సెల్ఫీ తీసుకున్న పారిశుద్ధ్య కార్మికులు



ప్యారిస్ : మాజీ మంత్రి, నటి రోజాతో సెల్ఫీ తీసుకోవడానికి యత్నించిన పారిశుద్ధ్య కార్మికులను ఆమె దూరంగా నిల్చోమన్నట్లు చెప్పిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. తమిళనాడులోని తిరుచ్చెందూర్ సుబ్రమణియస్వామి ఆలయంలో సోమవారం వరుషాభిషేకం జరిగింది. ఈ వేడుకల్లో పాల్గొన్న రోజా, ఆమె భర్త సెల్వమణి స్వామి దర్శనం చేసుకున్నారు. అక్కడున్న చాలామంది వారితో సెల్ఫీ తీసుకున్నారు. అదే సమయంలో కొందరు పారిశుద్ధ్య కార్మికులు వెళ్లగా వెంటనే ఆమె వారిని దూరం జరిగి నిల్చోవాలంటూ చేతులు చూపినట్లు వీడియోలో ఉంది. వారు పక్కకు జరిగి సెల్ఫీ తీసుకున్నట్లు ఉంది. నెటిజన్లు ఆమె తీరును విమర్శిస్తున్నారు.




ప్రపంచంలో అతిపెద్ద క్రీడా ఈవెంట్‌కు ఇంకా 9 రోజుల సమయమే ఉంది. విశ్వ క్రీడాసంబరం ఒలింపిక్స్ ఈనెల 26 నుంచే ప్రారంభం కానుంది. పారిస్ వేదికగా అంగరంగ వైభవంగా క్రీడలు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎప్పట్లాగే ఎన్నో ఆశలతో భారత బృందం కూడా ఒలింపిక్స్‌కు సిద్ధమైంది.

ఈసారి భారత్ 117 మంది అథ్లెట్లను ఒలింపిక్స్‌కు పంపుతోంది. ఇందుకు సంబంధించిన జాబితాకు కేంద్ర క్రీడామంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. అయితే, ఈ జాబితాలో మహిళా షాట్‌పుటర్ అబా కతువా పేరు లేకపోవడం గమనార్హం. ప్రపంచ ర్యాంకింగ్స్ కోటాలో ఆమె పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. ఆమె పేరును ఎందుకు తొలగించారనే దానిపై స్పష్టత లేదు. అథ్లెట్లతోపాటు 140 మంది సహాయక సిబ్బంది, అధికారుల బృందం కూడా పారిస్‌కు వెళ్లనుంది. ఇందులో 72 మంది ఖర్చులను ప్రభుత్వం భరించనుంది. నిబంధనల ప్రకారం సహాయక సిబ్బంది సంఖ్య 67 మించకూడదు. దీంతో ఐదుగురు వైద్య బృందం, సహాయక సిబ్బంది 67 మందికి ప్రభుత్వం ఖర్చులు భరించనుంది. భారత అథ్లెటిక్స్ బృందంలో 29 మంది ఉండగా 11 మహిళ, 18 మంది పురుష క్రీడాకారులు ఉన్నారు. షూటింగ్ టీమ్‌లో 21, హాకీ జట్టులో 19 మంది ఉన్నారు. టేబుల్ టెన్నిస్ (8), బ్యాడ్మింటన్ (7), రెజ్లింగ్ ( 6), ఆర్చరీ (6), బాక్సింగ్ (6), గోల్ఫ్ (4), టెన్నిస్ (3), స్విమ్మింగ్ (2), సెయిలింగ్ (2), ఈక్వెస్ట్రియన్, జుడో, రోయింగ్, వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో ఒక్కొక్కరు పోటీపడుతున్నారు.

2021లో జావెలిన్‌త్రోలో స్వర్ణం సాధించి భారత అథ్లెటిక్స్‌లో సువర్ణాధ్యాయాన్ని లిఖించిన నీరజ్ చోప్రా మరోసారి భారీ అంచనాలతో బరిలోకి దిగుతున్నాడు. బ్యాడ్మింటన్, బాక్సింగ్, రెజ్లింగ్‌లోనూ పతకాల ఆశలు రేపుతున్న క్రీడాకారులు చాలామందే ఉన్నారు. భారత్ బృందానికి చెఫ్ దే మిషన్‌గా షూటర్ గగన్ నారంగ్ నియమితులయ్యారు. ఒలింపిక్స్ ప్రారంభ వేడుకల్లో భారత్ తరఫున టేబుల్ టెన్నిస్ ఆటగాడు శరత్ కమల్‌తోపాటు మహిళా స్టార్ షట్లర్ పీవీ సింధు పతాకధారిగా వ్యవహరించనున్నారు.



## 'అయినమా పోయి రావలె హస్తినకు' అన్నట్లుగా సీఎం ఢిల్లీ టూర్‌లు

అమరావతి : "అయినమా పోయి రావలె హస్తినకు" అన్నట్లుంది ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటనలు అంటూ ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ఎద్దేవా చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఎన్డీఏ కూటమిలో పెద్దన్న పాత్రగా, ఢిల్లీలో చక్రం తిప్పాల్సిన తమరు..ఢిల్లీ చుట్టూ ఎందుకు చక్కర్లు కొడుతున్నట్లు అని ప్రశ్నించారు. ముక్కుపిండి విభజన సమస్యలపై పట్టుబట్టాల్సింది పోయి బీజేపీ పెద్దలకు జీ హుజూర్ అంటూ సలాంలు ఎందుకు కొడుతున్నారని నిలదీశారు. కేంద్రంలో, రాష్ట్రంలో కూటమి సర్కార్ ఏర్పడి నెల రోజులు దాటినా.. మోడీతో గానీ ,ఇతర మంత్రులతో గానీ ఒక్క హామీ మీద ఎందుకు ప్రకటన చేయించలేక పోయారని ఏపీసీసీ చీఫ్ అడిగారు.

**అదే బీజేపీ సిద్ధాంతం :** "గెలిచిన రోజు నుంచి నాలుగు సార్లు ఢిల్లీ పర్యటనలు చేసినా రాష్ట్ర ప్రయోజనాలపై ఒక్క ప్రకటన అయినా వచ్చిందా ? విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఉండదు అని కేంద్ర పెద్దలతో చెప్పించ గలిగారా ? పోలవరం ప్రాజెక్ట్ కి నిధులపై స్పష్టత ఇచ్చారా ? రాజధాని నిర్మాణం పై కేంద్రం ఇచ్చే సహాయం ఏంటో చెప్పగలిగారా ? "ఒడ్డు దాటేదాకా ఓడ మల్లన్న.. దాటక బోడి మల్లన్న ". ఇదే బీజేపీ సిద్ధాంతం. బాబు గారు ఇప్పటికైనా కళ్లు తెరవడం మంచింది. మరోసారి రాష్ట్ర ప్రజల మనోభావాలతో బీజేపీ ఆటలు ఆడుకుంటుంది అని గుర్తిస్తే మంచిది" అంటూ వైఎస్ షర్మిల హితవుపలికారు.

**బాబు ఢిల్లీ టూర్...** కాగా...మరోసారి హస్తినకు వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. కేంద్రమంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారు. ఏపీ ఆర్థిక పరిస్థితి గురించి కేంద్రమంత్రికి వివరించారు.

గత ఐదేళ్లలో రాష్ట్రం ఆర్థిక విధ్వంసానికి గురైందని వెల్లడించారు. అస్తవ్యస్థ నిర్వహణ, అవినీతి కారణంగా ఏపీ ఆర్థిక వ్యవస్థ గాడి తప్పిందని అమిత్‌షాకు బాబు తెలియజేశారు. అనంతరం సీఎం అధికారిక నివాసం (1, జన్‌పథ్)లో పూజలు నిర్వహించి విజయవాడకు తిరుగుపయనమయ్యారు. ఢిల్లీ పర్యటనలో సీఎంతో పాటు రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, కేంద్ర మంత్రులు కే. రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీలు లావు శ్రీకృష్ణ దేవరాయలు, కేశినేని చిన్ని తదితరులు ఉన్నారు.

## 11 సీట్లు ఎందుకు ఇచ్చామా అని ప్రజలు ఆలోచిస్తున్నారు..: బుద్దా వెంకన్న





విజయవాడ: తెలుగుదేశం సీనియర్ నేత బుద్దా వెంకన్న మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రజలు వాతలు పెట్టినా ఇంకా జగన్‌కు బుద్ధి రాలేదని, పేర్ని నాని కి శ్వేత పత్రం అంటే ఏంటో తెలుసా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ.. ఎప్పుడైనా వైసీపీ వాళ్లు శ్వేత పత్రాలు విడుదల చేశారా? అని నిలదీశారు. సీఎం చంద్రబాబు పోలవరం వెళ్లడం తప్పా? పోలవరం పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఆయన పర్యటన చేస్తున్నారని, వైసీపీ పరిపాలన ఎలా చేశారో చెప్పాల్సిన బాధ్యత చంద్రబాబుపై ఉందన్నారు. వైసీపీ వాళ్ళ దొంగతనాలు ఎక్కడ బయటపడతాయోనని భయపడి ప్రెస్ మీట్‌లు పెడుతున్నారని బుద్దా వెంకన్న విమర్శించారు. చంద్రబాబు సీఎం అవ్వగానే పెంచిన పింఛన్లు అందించారని.. అదే జగన్ ముఖ్యమంత్రి అవ్వగానే ప్రజావేదిక కూల్చారని ఎద్దేవా చేశారు. అసలు చెత్త పన్ను వేసింది ఎవరు?.. జగన్ ఐదు సంవత్సరాలు పాటు రాష్ట్రాన్ని చెత్త గా మార్చేశారని.. చంద్రబాబు ఆ చెత్తంతా క్లీన్ చేస్తున్నారని, 35 రోజుల్లోనే ఆ చెత్త అంత క్లీన్ అయిపోతుందా? అని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు చంద్రబాబు ఢిల్లీ పర్యటనలు చేస్తున్నారని ఎప్పుడైనా జగన్ ఢిల్లీ వెళ్లినప్పుడు రాష్ట్ర అభివృద్ధి కోసం పని చేశారా? అని నిలదీశారు. దోచుకున్న లక్షల కోట్లతో సోషల్ మీడియాని నడిపిస్తున్నారని, ఆ డబ్బులతో సోషల్ మీడియాతో కూటమి నేతలపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.

**ప్రతిపక్ష హోదా కూడా లేదు..** ప్రజలు వైసీపీకి కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదని బుద్దా వెంకన్న ఎద్దేవా చేశారు. ఇప్పటికే ప్రజలు వైసీపీ పార్టీని అసహ్యించుకుంటున్నారని, ఆ 11 సీట్లు ఎందుకు ఇచ్చామా అని ప్రజలు ఆలోచిస్తున్నారని, పూర్తిగా భూస్థాపితం చేస్తే బాగుండని అనుకుంటున్నారన్నారు. పేర్ని నాని బందర్‌ను ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. ఇప్పటివరకు పోర్టు అనేది పూర్తి చేయలేదని విమర్శించారు. చంద్రబాబు పోర్ట్ నిర్మాణం పూర్తి చేస్తారన్నారు. మచిలీపట్నానికి రూ. 70వేల కోట్లతో బీపీసీఎల్ రిఫైనరీ తీసుకొస్తున్నారని, ఇక జగన్ అధికారంలోకి రావడం కలే అన్నారు. చంద్రబాబుకు మరో అవకాశం వచ్చినట్లు, వైసీపీకి కూడా మళ్లీ అధికారం వస్తుందని పగటి కలలు కంటున్నారన్నారు.

**జగన్‌ను ప్రజలు మరోసారి నమ్మరు..** చంద్రబాబు నాయుడు రెక్కల కష్టంతో పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారని, బాబును ప్రజలు నమ్మారు కాబట్టి అధికారంలోకి వచ్చామని బుద్దా వెంకన్న అన్నారు. జగన్మోహన్ రెడ్డిని ప్రజలు మరోసారి నమ్మే అవకాశమే లేదన్నారు. వైసీపీ నేతలు కాజేసిన డబ్బు గురించి ప్రజలకు చెప్పడం తప్పా? అని ప్రశ్నించారు. జగన్ భవంతుల్లో ఉండొచ్చు కానీ, పేదవాళ్లు సొంత నివాసాల్లో ఉండకూడదా? అని నిలదీశారు. టిడ్కో ఇళ్లు జగన్ ఎందుకు పూర్తి చేయలేకపోయారు. గాలి మాటలు చెప్పడం వైసీపీ నేతలు మనుకోవాలన్నారు. 2024 నుంచి 2029 కాలంలో రాష్ట్రం పరుగులు పెడుతుందని, అసలు రాష్ట్రంలో ఎన్ని శాఖలు ఉన్నాయో జగన్మోహన్ రెడ్డికి తెలుసా?.. ఇప్పటికే ప్రజలు ఓటు రూపంతో వైసీపీ నేతలకు వాతలు పెట్టారని, నిజంగా కొలిమిలో కడ్డీ పెట్టి వాత పెట్టే దాకా తెచ్చుకోవద్దని బుద్దా వెంకన్న హితవుపలికారు.

## ఏపీ జాతీయ రహదారులు, హైవే ప్రాజెక్టులపై కేంద్రమంత్రి సమీక్ష..



తిరుపతి: రేణిగుంట విమానాశ్రయానికి కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ రోడ్డు రవాణా శాఖ మంత్రి జనార్దన్ రెడ్డి, ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే తదితరులు ఆయనకు పూలమాలలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎయిర్‌పోర్టు వీఐపీ లాంజ్‌లో ఆంధ్రప్రదేశ్ జాతీయ రహదారులు, హైవే ప్రాజెక్టులు, రాష్ట్ర రహదారుల పరిస్థితిపై అధికారులు, ప్రజాప్రతినిధులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.

**జాతీయ రహదారులు, ప్రాజెక్టులపై చర్చ..! :** ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం రాజధాని అమరావతిని ఏపీలోని ఇతర ప్రాంతాలు, పక్క రాష్ట్రాలతో అనుసంధానించే పలు రహదారుల ప్రాజెక్టులకు ప్రాథమికంగా ఆమోదం తెలిపింది. 189 కి.మీ. పొడవైన అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డు(ఓఆర్ఆర్) సహా కీలక ప్రాజెక్టులపై రాష్ట్ర మంత్రి జనార్దన్ రెడ్డి, అధికారులతో కేంద్ర మంత్రి మాట్లాడినట్లు సమాచారం. అలాగే విజయవాడ తూర్పు బైపాస్ రోడ్డు, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నుంచి నిడమనూరు వరకు ఫ్లైఓవర్ ఏర్పాటు సహా రాష్ట్రంలోని రోడ్లు, రహదారుల పరిస్థితిపై కేంద్ర మంత్రి అధికారులతో చర్చించినట్లు తెలుస్తోంది.

## పొట్టి గౌనులో తెలుగు బుల్లి తెర బాంబ్

తెలుగు బుల్లితెర ప్రేక్షకులతో పాటు వెండి తెర ప్రేక్షకులకు ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేని పేరు శ్రీముఖి. బుల్లి తెరపై లేడీ సూపర్ స్టార్ ఇమేజ్ ను సొంతం చేసుకున్న ఈ అమ్మడు వెండి తెరపై కూడా అప్పుడప్పుడు సందడి చేయడం ద్వారా అన్ని వర్గాల వారిని ఆకట్టుకుంటూ ఉంది. బుల్లి తెర కి గ్లామర్ అద్దిన యాంకర్ శ్రీముఖి. సాధారణంగా తెలుగు యాంకర్స్ అనగానే చీర కట్టు తో లేదా నిండైన డ్రెస్ లతో ఉంటారు అనే అభిప్రాయం ఉండేది. కానీ బుల్లి తెరకి ఏం తక్కువ అన్నట్లుగా శ్రీముఖి హీరోయిన్స్ రేంజ్ లో



అందాల ఆరబోత, స్కిన్ షో చేయడం మొదలు పెట్టింది. సోషల్ మీడియాలో అంతకు మించి అన్నట్లుగా బాలీవుడ్ హీరోయిన్స్ కు పోటీ ఇచ్చే విధంగా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేస్తూ ఆకట్టుకుంటూ ఉంది. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఈ రెడ్ డ్రెస్ పిక్స్ చూపు తిప్పుకోనివ్వడం లేదు. పొట్టి డ్రెస్ లో క్లీవేజ్ షో చేస్తూ శ్రీముఖి పిచ్చెక్కిస్తోంది. పొట్టి గౌను లో తెలుగు బుల్లి తెర బాంబ్ అంటూ ఆమె ఫ్యాన్స్ మరియు నెటిజన్స్ తెగ కామెంట్స్ చేస్తూ, షేర్ చేసిన నిమిషాల వ్యవధిలోనే ఈ ఫోటోలకు లక్షల కొద్ది లైక్ చేయడం, షేర్ చేయడం జరిగింది. ముందు ముందు ఈ అమ్మడి అందాల ఆరబోత ఫోటోలు మరిన్ని రావాలని వారు కోరుకుంటున్నారు. మరి కొందరు మాత్రం ఈ ఫోటోలు చూసిన తర్వాత టాలీవుడ్ ఫిల్మ్ మేకర్స్ పై తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నారు. ఎక్కడ నుంచో హీరోయిన్స్ ను తీసుకు వచ్చే బదులు వారి కంటే పదుల రెట్లు అందంగా ఉన్న శ్రీముఖిని మన స్టార్ హీరోలకు జోడీగా నటింపజేస్తే బాగుంటుంది కదా అంటూ ప్రశ్నిస్తున్నారు.. నిజమే కదా... మన ఫిల్మ్ మేకర్స్ శ్రీముఖి ని హీరోయిన్ గా నటింపజేస్తే బాగుంటుంది కదా...!

## ఆ విషయంలో అక్కనే మించిపోయేలా ఉందే!

ఖుషీ కపూర్ ఇన్ స్టా యాక్టివిటీ గురించి చెప్పాల్సిన పనిలేదు. హీరోయన్ గా ఎంట్రీ ఇవ్వడానికి ముందే అమ్మడు ఫాలోయింగ్ లోపీక్స్ కి చేరుతుంది. ఇప్పటికే అమ్మడి ఖాతాలో మిలియన్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. ఇదంతా హీరోయిన్ కాక ముందే..ఇక నటిగా ఎంట్రీ ఇచ్చిన తర్వాత మామ్ ఇమేజ్ తో ఇంకే స్థాయికి రీచ్ అవుతుందో చెప్పాల్సిన పనిలేదు. ఇన్ స్టా లో ఇప్పటికే ఖుషీ హాట్ అందాలతో ఎన్నో ఫోటోలను పోస్ట్ చేసింది. స్విమ్ షూట్లు..బికినీ దుస్తులు సంగతి పక్కనబెడితే డిజైనర్ దుస్తుల్లో ఎప్పటికప్పుడు తనదైన మార్క్ వేసే ప్రయత్నం కనిపిస్తుంది. ఈ విషయంలో అమ్మడు అక్క జాన్వీకపూర్ నే ఫాలో అవుతుంది. తెలివిగా



అక్క నుంచి చెల్లి కాపీకొడుతూ ఇన్ స్టాలో పాపులారిటీని రెట్టింపు చేసుకుంటుంది. తాజాగా మరో డిజైనర్ పిక్ తో నెటి జనుల ముందుకొచ్చేసింది. ఇదిగో ఇక్కడ ఖుషీ కపూర్ ముస్తాబైన విధానం చూస్తే అందమంతా ఖుషీ సొంతమా? అనిపించక మానదు. వైట్ కలర్ డిజైనర్ బాడీ కార్న్ దుస్తుల్లో ఖుషీ ఎంతో అందంగా కనిపిస్తుంది. వైట్ క్లాత్ పై ఆ డిజైన్ ఎంతో బ్యూటీని జోడించింది. టాప్ టూ బాటమ్ జాన్వీ శరీరాన్ని కవర్ చేస్తూ ధరించిన దుస్తుల్లో ఎంతో ఆకర్ష ణీయంగా కనిపిస్తుంది. నెక్ పై వైట్ డిజైన్ తో కూడిన నెక్లెస్, చెవులకు అదే రంగు బుట్టలు ధరించింది. నుదిటిన సన్నని బొట్టు ఖుషీ ముఖాన్ని మరింత అందంగా తీర్చిదిద్దింది. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. ఈ బ్యూటీలో ఖుషీ ని చూసి అభిమానులు స్టన్ అవుతారు? అంత అందంగా హైలైట్ అయ్యేది ఖుషీనా? అంటూ ఆశ్చర్యపోతున్నారు. చూస్తుంటే భవిష్యత్ లో అక్క జాన్వీకి ఇంట్లోనే పోటీ తయారయ్యేలా ఉందంటున్నారు. ఇక నటిగా ఖుషీ కపూర్ ని కరణ్ జోహార్ పరిచయం చేస్తోన్న సంగతి తెలిసిందే.




## అవికాగోర్ ఫేట్ మారేనా?



హర్రర్ చిత్రాల మాస్టర్ విక్రమ్ భట్ దర్శకత్వం వహించిన చిత్రం 'బ్లడీ ఇష్క్'. మహేష్ భట్ నిర్మాత. అవికా గోర్ ప్రధాన పాత్రలో నటించింది. ఈ చిత్రం 26 జూలై 2024న డిస్నీ హాట్‌స్టార్‌లో ప్రత్యేకంగా విడుదల కానుంది. తాజాగా రిలీజ్ చేసిన స్పైన్ చిల్లింగ్ ట్రైలర్‌లో అవికా నటన అబ్బురపరిచింది. చెడు మీ అన్ని భావోద్వేగాలను నియంత్రించడానికి సిద్ధమైనప్పుడు.. ప్రేమ ప్రతిదీ ఓచోట చేర్చి, అన్ని భయాలు, ఆత్మలకు వ్యతిరేకంగా బలంగా నిలబడుతుందా? అనే థీమ్ లైన్ తో ఈ సినిమాని రూపొందించారు. 1920 సిరీస్‌లో వైఆర్ఎఫ్ నుంచి ఇది నాలుగో సినిమా. ట్రైలర్ ఆద్యంతం హారర్ థ్రిల్స్ కి కొదవేమీ లేవు. కానీ అవికా గోర్ కోసం అప్పటికే ఆడి వెళ్లిపోయిన పాత సినిమా ఫార్ములానే తిరిగి ఎందుకు బయటికి తీసారు? అన్న సందేహం కలగక మానదు. హారర్ జానర్ లో ఒక సినిమా రావడం అంటే అందులో కొత్తదనం, థీమ్ లో ఏదైనా ఆకర్షించే అంశం ఉండాలి. కానీ అవేవీ ఈ ట్రైలర్ లో కనిపించలేదు. మరో రెగ్యులర్ హారర్ థ్రిల్లర్ లో అవిక నటించింది. తన సినిమా గురించి అవికా గోర్ మాట్లాడుతూ, "విక్రమ్ సర్ (విక్రమ్ భట్) ఈ చిత్రాన్ని విజువలైజ్ చేస్తున్నప్పుడు నా గురించి ఆలోచించడం, ఎంపిక చేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను. హారర్ అనేది నేను ఒక జానర్‌గా ఆనందిస్తాను. ఈ పాత్రను పోషించడం ఆసక్తికరంగా , సవాలుగా ఉంది. ఇది 1920లో పాత్రల కంటే పూర్తిగా భిన్నమైనది. బలమైన ఉద్వేగభరితమైన స్త్రీ పాత్ర కోసం నన్ను పరిగణలోకి తీసుకున్నందుకు నేను నిజంగా కృతజ్ఞురాలిని.. భట్‌లతో కలిసి మళ్లీ పని చేయడానికి ఇది నాకు గొప్ప అవకాశం. ఈ పాత్ర (నేహా) నటిగా నా అంతర్గత సామర్థ్యాలను తెలుసుకోవడంలో నాకు సహాయపడింది. నేను డిస్నీం హాట్‌స్టార్‌తో కలిసి పనిచేయడాన్ని పూర్తిగా ఆస్వాధించాను" అని తెలిపారు. ఈ చిత్రం గురించి దర్శకుడు విక్రమ్ భట్ మాట్లాడుతూ– "నన్ను నమ్మడం కష్టంగా ఉండవచ్చు, కానీ హారర్ చిత్రాలను వీక్షకుల కోసం రూపొందించడాన్ని నేను పూర్తిగా ఆస్వాధిస్తాను కానీ వాటిని చూడాలంటే భయంగా ఉంటుంది. నేను చాలా కాలంగా హర్రర్ లవ్ స్టోరీని సినిమాగా తీయాలని అనుకుంటున్నాను. నేను దాని గురించి భట్ సాహబ్‌తో మాట్లాడినప్పుడు రెండవ ఆలోచన లేకుండా ఓకే చెప్పాడు. ఆపై 'బ్లడీ ఇష్క్' చిత్రీకరణ మొదలైంది. డార్క్ సెటప్, దెయ్యాలు, ఆత్మలు వంటి హారర్ నేపథ్యం అంశాలను మంచి కథకు ట్విస్ట్‌లను జోడించి, ప్రేమకథ, సస్పెన్స్ అంశాల మిశ్రమాన్ని అందించాలనుకున్నాను. అవికా గోర్ పరిశ్రమలోని అత్యంత ప్రతిభావంతురాలైన నటీమణుల్లో ఒకరు. 1920: హారర్స్ ఆఫ్ ది హార్ట్, బ్లడీ ఇష్క్‌లో అవిక నటించాలని అనుకున్నాను.. తన నటనతో తనను తాను అధిగమించింది. ఈ చిత్రం డిస్నీం హాట్‌స్టార్ ప్రేక్షకులకు మరచిపోలేని అనుభూతిని కలిగిస్తుందని అనుకుంటున్నాను" అన్నారు. విక్రమ్‌తో కొత్త చిత్రాలను రూపొందించడం ఎల్లప్పుడూ గొప్ప విషయమని మహేష్ భట్ అన్నారు. ప్రేక్షకులు చూడటానికి ఇష్టపడే వాటిని అందించే విషయంలో మేము ఎల్లప్పుడూ ఒకే పేజీలో ఉంటాము. బ్లడీ ఇష్క్ అనేది ఒక రకమైన గ్రిప్పింగ్ స్టోరీ.. సినిమా పూర్తయిన తర్వాత కూడా ప్రేక్షకులను ఆలోచించుకునేలా చేస్తుంది. మేము డిస్నీం హాట్‌స్టార్ నుండి నిరంతర మద్దతును పొందాము. వారితో కలిసి పని చేయడం ఆనందదాయకమైన అనుభవంగా మారింది. గ్రిప్పింగ్ స్టోరీలైన్, ఊహించని మలుపులు, భయానక సంఘటనలు నిరంతరం వెంటాడుతూ ఉంటాయి. బ్లడీ ఇష్క్‌లో ఇవన్నీ ఉన్నాయి. డిస్నీ ం హాట్‌స్టార్ ప్రేక్షకులు ఖచ్చితంగా సినిమాను ఆస్వాదిస్తారని నేను విశ్వసిస్తున్నాను అని అన్నారు.

## డార్లింగ్ మూవీ బిజినెస్ ఎంతంటే?



ప్రియదర్శి, నభా నటేష్ జోడీగా తెరకెక్కిన డార్లింగ్ మూవీ జులై 19న థియేటర్స్ లోకి అడుగుపెడుతోంది. అశ్విన్ రామ్ ఈ సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇస్తున్నారు. అతనికిది మూడో సినిమా కావడం విశేషం. ఇదిలా ఉంటే ఈ సినిమా ప్రమోషన్ యాక్టివిటీస్ లో ప్రియదర్శి అండ్ టీమ్ ఉన్నారు. హీరోగా అతనిది మూడో సినిమా. మల్లేశం, బలగం తర్వాత ప్రియదర్శి ఈ సినిమాతో హీరోగా తన అదృష్టం పరీక్షించుకుంటున్నాడు. గత ఏడాది బలగం సినిమాతో ప్రియదర్శి హీరోగా బ్లాక్ బస్టర్ అందుకున్నారు. ఈ సారి రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ తో తనని తాను ప్రూవ్ చేసుకోవడానికి ప్రియదర్శి సిద్ధం అయ్యాడు.

ఇప్పటికే మూవీ నుంచి వచ్చిన ట్రైలర్ అందరిని ఆకట్టుకుంది. నభా నటేష్ ఈ సినిమాలో స్ప్లిట్ పర్సనాలిటీ ఉన్న అమ్మాయిగా కనిపిస్తోంది. రెండు రకాల వ్యక్తిత్వాలు ఉన్న హీరోయిన్ ని పెళ్లి చేసుకొని ప్రియదర్శి ఎలాంటి ఇబ్బందులు పడ్డాడు అనేది ఈ కథలో కామిక్ గా చూపించబోతున్నారు. హనుమాన్ సినిమాని పాన్ ఇండియా రేంజ్ లో నిర్మించిన ప్రైమ్ షో ఎంటర్టైన్మెంట్స్ డార్లింగ్ చిత్రాన్ని నిర్మించింది. నిర్మాత కూడా మూవీని గట్టిగానే ప్రమోట్ చేస్తున్నారు. అలాగే ప్రియదర్శి తన సర్కిల్ ఉపయోగించుకొని సినిమాని జనాల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నాడు. ఇదిలా ఉంటే ఈ సినిమాకి సంబంధించిన బిజినెస్ మొత్తం కంప్లీట్ అయ్యిందంట. నైజాం రైట్స్ ని మైత్రీ మూవీ మేకర్స్ వారు సొంతం చేసుకున్నారు. హనుమాన్ సినిమా రైట్స్ ని కూడా మైత్రీ వారే సొంతం చేసుకొని భారీ లాభాలు సొంతం చేసుకున్నారు. ఇప్పుడు డార్లింగ్ మూవీ నైజాం రైట్స్ ని కూడా 3 కోట్లకి మైత్రీ డిస్టిబ్యూటర్స్ దక్కించుకోవడం విశేషం. అలాగే ఆంధ్రా హక్కులని ఏషియన్ సురేష్ 2.50 కోట్లకి సొంతం చేసుకొని రిలీజ్ చేస్తున్నారు. ఓవర్సీస్ లో కూడా మంచి ధరకి రైట్స్ అమ్ముడైనట్లు తెలుస్తోంది. ఓవరాల్ గా 5.50–6 కోట్ల మధ్యలో ఈ సినిమా బిజినెస్ జరిగిందని తెలుస్తోంది. జులై 19న ఈ సినిమా థియేటర్స్ లోకి వస్తోంది. సినిమా మీద పాజిటివ్ వైబ్ ఉండటంతో యూత్ చూడటానికి ఇంటరెస్ట్ చూపించే ఛాన్స్ ఉందని అంచనా వేస్తున్నారు. నభా నటేష్ కి ఈ సినిమాతో కచ్చితంగా హిట్ రావాల్సి ఉంటుంది. చాలా గ్యాప్ తర్వాత ఆమె డార్లింగ్ సినిమాతో మరల ప్రేక్షకుల ముందుకి వస్తోంది. అలాగే బలగం లాంటి బ్లాక్ బస్టర్ తర్వాత ప్రియదర్శి డార్లింగ్ సినిమాతో మరో సక్సెస్ అందుకొని హీరోగా స్ట్రాంగ్ ఫౌండేషన్ వేసుకోవాలని అనుకుంటున్నారు.

## ఇప్పుడు మరింత బలంగా ఉన్నా: సమంత

సోషల్ మీడియాలో ఎక్కువగా స్పెషల్ ఫొటోస్ తో ఆకట్టుకునే సమంత అప్పుడప్పుడు తన పర్సనల్ లైఫ్ కు సంబంధించిన విషయాలను కూడా షేర్ చేసుకుంటూ ఉంటుంది. అలాగే తన ఆరోగ్య పరిస్థితి పై కూడా ఆమె కొన్ని సార్లు క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేసింది. విడాకుల అనంతరం సమంత ఎక్కువగా అత్యాద్మిక జీవితం వైపు ఫోకస్ చేస్తున్నట్లు కూడా అనిపిస్తూ ఉంటుంది. ఇక రీసెంట్ గా ఆమె ఇచ్చిన ఒక వివరణ హాట్ టాపిక్ గా మారింది. అక్కినేని నాగ చైతన్య, సమంత రూత్ ప్రభు జంటగా తొలిసారి నటించిన చిత్రం 'ఏమాయ చేశావే'. ఆ మూవీతో ప్రేక్షకుల మనసులను దోచుకున్నారు. ఈ చిత్రం విజయం సాధించడంతో, ఈ ఇద్దరి మధ్య కెమిస్ట్రీ ప్రేక్షకులను ఆకట్టుకుంది. మనం, అలాగే 'ఆటోనగర్ సూర్య' సినిమాలో కూడా



కలిసి నటించారు, ఇక ఆ సమయంలో ప్రేమలో పడ్డారు. కొంతకాలం తర్వాత పెళ్లి చేసుకున్న ఈ జంట, అనూహ్యంగా విడాకులు తీసుకున్నారు. విడాకుల తర్వాత, సమంత అనారోగ్యంతో బాధపడింది. మయోసైటిస్ అనే వ్యాధితో పోరాడుతూ, సినిమా రంగానికి బ్రేక్ ఇచ్చింది. ఈ సమయంలో ఆమె తన ఆరోగ్యాన్ని మెరుగుపర్చేందుకు రకరకాల మార్గాలను అన్వేషించింది. జిమ్‌లో కసరత్తులు చేస్తూ, యోగాసనాలు చేస్తూ తన శక్తిని పునరుద్ధరించేందుకు ప్రయత్నించింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో, సమంత తన ఇన్ డైరెక్ట్ గా విడాకులు మరియు మయోసైటిస్ అనుభవాల గురించి చెప్పింది. "జీవితంలో కొన్నిసార్లు మనం అనుకున్నవి జరగవు. కానీ, విశ్వాసం మనల్ని ముందుకు నడిపిస్తుంది. విశ్వాసం మనకు ప్రశాంతతని ఇస్తుంది. గత మూడు సంవత్సరాలు నాకు కష్టమైనా, ఇప్పుడు నేను మరింత బలంగా ఉన్నాను. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా వాటిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాను" అని సమంత తెలిపింది. "ఇప్పుడున్న బలం నాకు ఆధ్యాత్మిక చింతన నుండి వచ్చింది" అని ఆమె అభిప్రాయపడింది. "ఆధ్యాత్మికత నా జీవితంలోని అన్ని విషయాలను ప్రభావితం చేస్తుంది. సంఘర్షణలు, అవగాహనలు నాకు నేర్పినవి. ఆధ్మాత్మికత నాకు అవసరమైన బలంగా మారింది. ఆధ్మాత్మికత అంతులేని శక్తిగా ఉందని నేను నమ్ముతాను" అని సమంత పేర్కొంది. 2017 అక్టోబర్‌లో నాగ చైతన్యతో వివాహం చేసుకున్న సమంత, 2021 అక్టోబర్‌లో విడాకులు తీసుకుంది. ఆ అనుభవం ఆమెను మరింత బలంగా మార్చింది. ప్రస్తుతం, సమంత తన ఆరోగ్యం మీద దృష్టి పెట్టి, సినిమాలలో నటన కొనసాగిస్తూ, తన కెరీర్‌ని ముందుకు తీసుకెళ్తోంది.

## బంగారంలా మెరిసిపోతున్న ముద్దుల తనయ!

అంబానీ ఇంట పెళ్లి వేడుకలో భాగంగా అందాలన్నీ అక్కడే కొలువు దీరిన సంగతి తెలిసిందే. వారం రోజులుగా ముంబై అందాల భామల మధ్య మెరిసిపోతుంది. అంబానీ ఇంటికి సమీపంలో ఎటు చూసినా కళ్లు చెదిరే అందాలే కనిపిస్తున్నాయి. వేడుకకు భారీ ఎత్తున హీరోయిన్లు అందరూ హాజరవ్వడంతో? స్పాట్ ఓ బ్యూటీ హాబ్ గా మారిపోయింది. ఎవరి స్టైల్లో వారు డిజైనర్ దుస్తుల్లో మెరిపించారు. ముస్తాబు అవ్వడంలో ఒకరికొకరు పోటీ పడి మరీ అలంకరించుకున్నారు. ఏ ఒక్కరూ తీసేయలేని అందం. సినిమా భామల నుంచి ఇతర రంగాల వరకూ హాజరైన అందాలన్నీ ఒకర్ని మించి ఒకరున్నారు. ఈ అందాలన్నీ ఒక ఎత్తైతే పెళ్లి కూతురు,పెళ్లి కోడుకు బంగారు దుస్తుల్లో మెరవడం మరో ఎత్తు. బంగారం దుస్తులు వేసుకుంటే ఎలా



ఉంటుందో? అంబానీ చూపించాడు. అయితే వీళ్లందర్నీ తలదన్నేలా అతిలోక సుందరి శ్రీదేవి ముద్దుల కుమార్తె జాన్వీ న్యూ లుక్ చూస్తే స్టన్ అవ్వాల్సిందే. డిజైనర్ లెహంగాలో జాన్వీ ఒదిగిన విధానం చూస్తే! అందమంతా జాన్వీకే సొంతమా అనడం ఖాయం. అంత అందంగా జాన్వీ మురిపిస్తుంది. నుదిటిన పాపిడి బొట్టు నుంచి..మెడలో ధరించిన హారం.. చేతులకు ఎంపిక చేసుకున్న గాజులు..చెవి బుట్టలు ప్రతీది జాన్వీని ఎంతో అందంగా మలిచాయి. బంగారు వర్ణం పోలిన లెహంగా పై టెంపుల్ జ్యువెలరీ అలంకరణ జాన్వీని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దింది. లెహంగా స్కర్ట్–విలాస వంతమైన బంగారు రంగులో బ్లౌజ్‌పై ఉన్న సాంప్రదాయ ఆభరణాలకు అనుగుణంగా ఎంతో క్రియేటివ్ గా కనిపిస్తుంది. ప్రముఖ స్టైలిస్ట్ అమీ పటేల్, అనుష్క దా మిని దీన్ని రూపొందించారు. ప్రస్తుతం ఈ ఫోటో అంతర్జాలంలో వైరల్ గా మారింది. జాన్వీ అందానికి అభిమాను లంతా ఫిదా అవుతున్నారు.




## కేధార్‌నాద్ ఆలయంలో 228 కిలోల బంగారం అదృశ్యం వివాదం: స్పందించిన ట్రస్ట్

కేధార్‌నాద్ దేవాలయంలో వందల కిలోల బంగారం మాయమైందన్న ఆరోపణలపై ఆలయ కమిటీ బుధవారం స్పందించింది. బద్రీనాద్-కేధార్‌నాద్ ఆలయ కమిటీ ఛైర్మన్ అజేంద్ర అజయ్ మాట్లాడుతూ.. స్వామీ అవిముక్తేశ్వరానంద ప్రకటన దురదృష్టకరమన్నారు. వాస్తవాలను ప్రజల ముందుంచాలని ఆయన స్వామీజీని కోరారు. "కేధార్‌నాద్ ఆలయంలో 228 కిలోల బంగారం మాయమైందని స్వామీ అవిముక్తేశ్వరానంద ప్రకటనలు చేయడం చాలా దురదృష్టకరం. నేను ఆయన్ను అభ్యర్థిస్తున్నా.. సవాలు కూడా చేస్తున్నా. వాస్తవాలను ప్రపంచం ముందుంచాలని కోరుతున్నా. స్వామీజీ ప్రకటనలు చేసే కంటే.. సంబంధిత శాఖకు ఫిర్యాదు చేసి దర్యాప్తునకు డిమాండ్ చేయాల్సింది. అంతేకాదు.. ఆయన వద్ద ఆధారాలు ఉంటే హైకోర్టు లేదా సుప్రీం కోర్టును ఆశ్రయించవచ్చు" అని అజేంద్ర పేర్కొన్నారు. 'కేధార్‌నాద్ ఆలయ ప్రతిష్ఠకు భంగం కలిగించే హక్కు శంకరాచార్య( స్వామీ అవిముక్తేశ్వరానంద)కు లేదని అజేంద్ర వ్యాఖ్యానించారు. ఆయన రాజకీయ లక్ష్యాలతో పనిచేస్తే మాత్రం అది దురదృష్టకరమని పేర్కొన్నారు. ఆయన కేవలం ఆందోళనలు, వివాదాలు సృష్టించడానికే ఇలా చేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ అజెండా ముందుకు తీసుకెళ్లేందుకు పనిచేయడం విచారకరమన్నారు.

'కేధార్‌నాద్ ఆలయంలో తాపడం చేసిన 228 కేజీల బంగారం అదృశ్యమైందని స్వామీ అవిముక్తేశ్వరానంద సోమవారం ఆరోపణలు చేశారు. ఈ విషయాన్ని ఎందుకు తొక్కిపెడుతున్నారని ఆయన ప్రశ్నించారు. అక్కడ కుంభకోణం చేసి.. దిల్లీలో ఆలయ నమూనా నిర్మిస్తున్నారా..? అని ప్రశ్నించారు. బంగారం గోల్‌మాల్‌పై అసలు దర్యాప్తు ప్రారంభించలేదన్నారు. దీనికి బాధ్యులు ఎవరు? అని ప్రశ్నించారు. తాము కమిషనర్‌ను విచారణకు డిమాండ్ చేసినా ఫలితం లేదన్నారు. "తొలుత 320 కిలోల బంగారం మాయమైందన్నారు.. తరవాత 228 కిలోలకు తగ్గించారు.. ఆ తర్వాత 36..32.. 27 అన్నారు. బంగారం 320 కిలోలా.. 27 కిలోలా అన్నది సమస్య కాదు.. అది ఎక్కడికి పోయిందనేదే ముఖ్యం. బంగారం రాగిగా ఎలా మారుతుంది..?" అని నాడు అవిముక్తేశ్వరానంద వ్యాఖ్యానించారు.

## వీధికుక్కల దాడిలో బాలుడి మృతి ఘటన కలచివేసింది: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: కుక్కల దాడిలో బాలుడి మృతిపై సీఎం రేవంత్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. బాలుడి మృతి కలచివేసిందని చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వీధికుక్కల దాడిపై ఫిర్యాదుకు టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని చెప్పారు. పశు వైద్యులు, బ్లూక్రాస్ వంటి సంస్థల ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేయాలని తెలిపారు. కుక్క కాటుకు అన్ని ఆసుపత్రుల్లో తక్షణం వైద్యం అందించాలని ఆదేశించారు. శునకాల నియంత్రణలో ఇతర రాష్ట్రాల పద్ధతులను పరిశీలించాలని చెప్పారు. జవహర్‌నగర్‌లో వీధికుక్కల దాడిలో 18 నెలల చిన్నారి మృతి చెందిన విషయం తెలిసిందే.

## 4 నెలల్లో నైనీ బ్లాక్ నుంచి బొగ్గు ఉత్పత్తి ప్రారంభించాలి: భట్టి విక్రమార్క



హైదరాబాద్: సింగరేణి సంస్థకు ఒడిశాలో కేటాయించిన నైనీ బొగ్గు బ్లాక్‌కు సంబంధించి మిగిలిన పనులు వేగంగా పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. నాలుగు నెలల్లో గని నుంచి బొగ్గు ఉత్పత్తి ప్రారంభించేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. బుధవారం సచివాలయంలో ఇంధన శాఖ కార్యదర్శి రొనాల్డ్ రోస్, సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ బలరామ్, ఇతర అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. నైనీ బొగ్గు బ్లాక్‌పై చర్చించారు. సింగరేణి తొలిసారిగా తెలంగాణ వెలుపల చేపడుతున్న ప్రాజెక్టు కాబట్టి రాష్ట్ర ప్రభుత్వ, కంపెనీ ప్రతిష్ఠను పెంచేలా మైనింగ్ చేపట్టాలన్నారు. స్థానికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పనిచేయాలని కోరారు. ఒడిశా రాష్ట్ర అటవీ శాఖతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పనులు వేగంగా పూర్తయ్యేలా చొరవ చూపాలని సింగరేణి సంస్థను ఆదేశించారు. "నైనీ బ్లాక్ నిర్వాసితులకు ఉపాధి కల్పించాలి.

వారికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి. హైటెన్షన్ విద్యుత్తు లైన్‌ను వెంటనే నిర్మించే విధంగా ఒడిశా విద్యుత్ శాఖతో సంప్రదిస్తూ ముందుకు సాగాలి. పునరావాస, నష్టపరిహారం అంశాలపై చర్చించే ఆర్‌పీడీఏసీ మీటింగ్‌ను అతి త్వరగా పూర్తి చేసుకోవాలి. 2015లో సింగరేణికి నైనీ బొగ్గు బ్లాక్‌ను కేటాయించినప్పటికీ గత ప్రభుత్వ నిరాసక్తత వల్ల ఇప్పటికీ ఉత్పత్తి ప్రారంభం కాలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వానికి సింగరేణిపై ఉన్న ప్రత్యేక చొరవ కారణంగా నేను స్వయంగా ఒడిశా వెళ్లి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రితో అన్ని సమస్యల పరిష్కారానికి చర్చించాను" అని భట్టి విక్రమార్క తెలిపారు. సమావేశంలో సంస్థ సీఎండీ ఎన్ బలరామ్ మాట్లాడుతూ.. సమావేశంలో సూచించిన ప్రకారం ప్రతి పనికి నిర్దేశిత కాలపరిమితిని విధించుకొని పూర్తి చేస్తామన్నారు. ఈ ఏడాది అక్టోబర్ నుంచి బొగ్గు ఉత్పత్తి ప్రారంభానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని వివరించారు.

## పార్టీ మారిన ఎమ్మెల్యేలు మాజీలు అయ్యేవరకు నిద్రపోం: హరీశ్‌రావు



పటాన్‌చెరు: పార్టీ మారిన ఎమ్మెల్యేలు మాజీలు అయ్యేవరకు నిద్రపోమని భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. పటాన్‌చెరులో నిర్వహించిన భారాస కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల అంశంపై సుప్రీంకోర్టులో పోరాడుతున్నామని, ఆ నియోజకవర్గాల్లో కచ్చితంగా ఉప ఎన్నిక వస్తుందన్నారు. 2001లో కేసీఆర్ ఉద్యమాన్ని పిడికెడు మందితో ప్రారంభించారని.. అప్పుడు కూడా కుట్రలు జరిగాయని తెలిపారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తమ పార్టీకి చెందిన 12మంది ఎమ్మెల్యేలను చేర్చుకున్నారన్నారు. కానీ, కుట్రలు ఫలించలేదని, న్యాయం గెలిచిందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ 14 ఏళ్లు పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని హరీశ్‌రావు గుర్తు చేశారు. "భారాస పని అయిపోయిందన్నవాళ్లు తర్వాత కనిపించకుండా పోయారు. పార్టీకి కష్టాలు వస్తాయి. ఎమ్మెల్యే పోతే పార్టీ పోదు. పటాన్‌చెరులో మంచి కార్యకర్తలు ఉన్నారు. ఇక్కడ ఎప్పుడు ఎన్నికలు వచ్చినా మళ్లీ ఎగిరేది గులాబీ జెండానే. మీరందరూ కష్టపడితేనే మహిపాల్ రెడ్డి గెలిచారు. పటాన్‌చెరుకు ఏం కావాలంటే అది ఇచ్చాం. రోడ్లు, తాగునీరు, స్టేడియం వంటివి ఎన్నో అందించాం. నిధుల వరద పారించాం. గూడెం పోయినా గుండె ధైర్యం కోల్పోవాల్సిన అవసరం లేదు. పార్టీ మారితే రాళ్లతో కొట్టండి అన్న రేవంత్ ఇప్పుడు ఇళ్లకు వెళ్లి కండువాలు కప్పుతున్నారు. జీవోలో రేషన్ కార్డు ఆధారంగా రైతు రుణమాఫీ అని చెప్పారు. మళ్లీ వ్యతిరేకత వస్తోందని మాట మార్చుతున్నారు. పాస్‌బుక్ ఉంటే సరిపోతుందని నోటి మాటతో చెబుతున్నారు. అదే నిజమైతే జీవో మార్చాలి. వడ్లకు బోనస్ అన్నారు.. తర్వాత సన్నవడ్లకే బోనస్ అంటూ 90 శాతం రైతులకు బోనస్ ఎగ్గొట్టారు. ఇప్పుడు రుణ మాఫీ విషయంలోనూ అదే చేస్తున్నారు. ఆరు గ్యారంటీల్లో ఒక్కటీ సరిగ్గా అమలు కాలేదు" అని హరీశ్‌రావు విమర్శించారు.

## ఖైరతాబాద్ గణేష్ వద్ద టెన్షన్.. టెన్షన్.. 70 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా..

హైదరాబాద్: ఖైరతాబాద్ గణేష్ వద్ద టెన్షన్ వాతావరణం చోటు చేసుకుంది. ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ ఏర్పాట్లలో గందరగోళం చోటు చేసుకుంది. 70 ఏళ్ల ఖైరతాబాద్ గణేశ్ చరిత్రలో తొలిసారిగా అవంతరాలు ఎదురవుతున్నాయి. గణేష్ విగ్రహ తయారీ పనులు ముందుకు సాగడం లేదు. ప్రతి ఏటా వంద రోజుల ముందు నుంచే ఖైరతాబాద్ గణేష్ విగ్రహ తయారీ పనులు ప్రారంభమవుతాయి. ఈసారి ఉత్సవ కమిటీ రెండు వర్గాలుగా చీలి పోయింది. ఈ వర్గపోరు కారణంగా పాత కమిటీ, కొత్త కమిటీల మధ్య సమన్వయం కొరవడింది.

దీంతో 36 రోజుల పాటు విగ్రహ పనులు నిలిచిపోయాయి. తమకు సమాచారం ఇవ్వకుండానే కొత్త కమిటీ కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఉత్సవ ప్రెసిడెంట్ రాజ్ కుమార్ అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కమిటీ చైర్మన్ సుదర్శన్ తర్వాత గత ఏడాది ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలను ఆయన కుమారుడు సుదర్శన్ నిర్వహించారు. ఈ ఏడాది సింగారి కుటుంబాన్ని పక్కనబెట్టి తామే ఉత్సవ పనులను చూస్తామని స్థానికులు అంటున్నారు. ఇది ఘర్షణకు దారి తీసింది. ఈ వివాదాన్ని సరిదిద్దేందుకు దానం నాగేందర్ రంగంలోకి దిగారు. ఆయన అధ్యక్షతన రెండు కమిటీల సమావేశం జరగనుంది. ఈ క్రమంలోనే ఖైరతాబాద్ గణేష్ మండపం వద్ద భారీగా పోలీసుల మోహరించారు.




హైదరాబాద్: రాష్ట్రంలో ఐదు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఇవాళ కుమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడుతాయని తెలిపింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో అక్కడక్కడ గంటలకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. నిన్న దక్షిణ ఛత్తీస్‌గఢ్ పరిసర విదర్భ ప్రాంతంలో కేంద్రీకృతమైన అల్పపీడన ప్రాంతం ఈ రోజు బలహీనపడినట్లు తెలిపింది. రుతుపవన ద్రోణి ఈరోజు జైసాల్మెయిర్, కోట, గుణ, కళింగపట్నం తూర్పు ప్రాంతం గుండా మధ్య బంగాళాఖాతం వరకు పయనిస్తూ సగటు సముద్ర మట్టానికి 1.5 కి.మీ ఎత్తులో కొనసాగుతున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొంది. మరో అల్పపీడనం ఈ నెల 19న పశ్చిమ మధ్య దాని పరిసర వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది.




## 2000 పోస్టులకు 25వేల మంది.. నిరుద్యోగులతో నిండిన ముంబయి ఎయిర్‌పోర్టు

ముంబయి: ఎయిర్‌పోర్టుకు భారీగా తరలివచ్చిన జనాలను చూసి, అక్కడి సిబ్బంది ఆశ్చర్యపోయారు. వారిని నియంత్రించలేక నానా ఇబ్బందులు పడ్డారు. అదంతా ప్రయాణికుల రద్దీ ఏమీకాదు. ముంబయి ఎయిర్‌పోర్టులో నిర్వహించిన ఎయిర్ ఇండియా రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌కు వచ్చిన నిరుద్యోగులు వారంతా. దీనికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 2,216 ఖాళీలను భర్తీ చేసేందుకు ముంబయి ఎయిర్‌పోర్టులో మంగళవారం ఎయిర్ ఇండియా రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించింది. దీనికి నిరుద్యోగులు భారీగా తరలివచ్చారు. కౌంటర్ల వద్ద తమ పత్రాలు సమర్పించేందుకు వారంతా ఒకరినొకరు తోసుకోవడం కనిపించింది. ఆహారం, నీరు అందక పలువురు ఇబ్బంది పడ్డారు. కొందరు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. లోడర్ పోస్టుల కోసం ఈ డ్రైవ్ జరిగినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఆ ఉద్యోగంలో చేరినవారు విమానం నుంచి లగేజీ దించడం, ఎక్కించడంతోపాటు బ్యాగేజీ బెల్టులను చూసుకోవాలి. ఒక్కో ఎయిర్‌క్రాఫ్ట్‌లో లగేజీ, కార్గోను చూసుకునేందుకు ఐదుగురు లోడర్స్ అవసరం ఉంటుంది. వారికి నెలకు రూ.20వేల నుంచి 25 వేలకు వేతనం అందిస్తారు. ఓవర్‌టైమ్ చేసి చాలామంది రూ.30వేల వరకు సంపాదిస్తుంటారు. ఈ ఉద్యోగానికి కనీస విద్యార్హతలు ఉంటే సరిపోతుంది కానీ, అభ్యర్థులు శారీరకంగా దృఢంగా ఉండటం తప్పనిసరి. ఈ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకునేందుకు కొందరు 400 కి.మీ. ప్రయాణించి రావడం గమనార్హం. వారిలో పోస్టు గ్రాడ్యుయేషన్, డిగ్రీ పూర్తి చేసినవారు కూడా ఉన్నారు. ఉన్నత చదువులు చదివినా ఇప్పటివరకు ఉద్యోగం లభించనివారు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవడం కోసం వచ్చారు. మరికొందరు రాజస్థాన్ నుంచి వచ్చినవారు ఉన్నారు. ఇదిలాఉంటే.. గుజరాత్‌లోని అంక్లేశ్వర్‌లో కొద్దిరోజుల క్రితం ఇలాంటి ఘటనే చోటుచేసుకుంది. ఇంటర్వ్యూకు వచ్చిన ఉద్యోగార్థుల రద్దీ ఎక్కువై ఒకరినొకరు తోసుకున్న దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి.

## ఖైరతాబాద్ మహా గణపతి కొత్త ఉత్సవ కమిటీని ఏర్పాటు చేశాం..



హైదరాబాద్: ఖైరతాబాద్ మహా గణపతి పనులు చురుకుగా కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. ఈ ఏడాది గణేష్ నవరాత్రులను వైభవంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ రోజు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మహా గణపతి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ సమితికి స్థానిక ఎమ్మెల్యే అధ్యక్షుడిగా ఉంటారని తెలిపారు. ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేస్తామన్నారు. రెండు కమిటీ ఆలోచనలను పరిగణలోకి తీసుకున్నామన్నారు. అందరూ ఉత్సవ కమిటీ సభ్యులేనని దానం నాగేందర్ అన్నారు. కులమతాలకు అతీతంగా ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. రాబోయే రోజుల్లో గిన్నిస్ రికార్డ్స్‌లోకి ఎక్కబోతున్నామని.. దీనిని బాధ్యతగా భావించి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. మా మధ్య ఎలాంటి బేధాభిప్రాయాలు లేవని తెలిపారు. అడ్‌హాక్ పేరుతో ఖైరతాబాద్ గణేష్ కొత్త ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. డొనేషన్స్ నుంచి వచ్చే డబ్బును రోజూ డిస్‌ప్లే చేస్తామన్నారు. విద్యా, ఆర్థిక స్థోమత లేని వారికీ సహాయం అందిస్తామన్నారు. మల్టి పర్పస్ కమ్యూనిటి హాల్ కట్టబోతున్నామని దానం నాగేందర్ వెల్లడించారు. ఇక్కడ ఖైరతాబాద్ వాసులు నామినల్ ఫీ కట్టి హాల్‌ను వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. అడహక్ కమిటీకి తాను అధ్యక్షుడిగానూ.. రాజ్ కుమార్ చైర్మన్ గానూ ఉంటారని తెలిపారు. అడ్ హాక్ ఉత్సవ్ కమిటీలో 100 మంది సభ్యులు ఉంటారని తెలిపారు.

కమిటీ సభ్యులకు ఐడి కార్డు ఉంటుందని వెల్లడించారు. ఉత్సవ కమిటీ సభ్యులంతా సమానమేనన్నారు. ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ్ కమిటీ , శ్రీ గణేష్ ఉత్సవ్ కమిటీ మధ్య విభేదాల నేపథ్యంలో అడ్ హాక్ పేరుతో కొత్త కమిటీ ఏర్పాటు చేశామని దానం నాగేందర్ స్పష్టం చేశారు. ఇక ఖైరతాబాద్ గణేషుని వద్ద ప్రతి రోజూ ప్రసాదాలు పంపిణీ చేస్తామన్నారు. పోలీసులు, మీడియా వలంటీర్స్‌కు భోజనాలను ఏర్పాటు చేస్తామన్నారు. బోనాల ఫెస్టివల్ తర్వాత ధూప దీపాలకు నోచుకోని అన్ని టెంపుల్స్‌కి కమిటీలు ఏర్పాటు చేయబోతున్నామని దానం నాగేందర్ వెల్లడించారు.

## బోనాల చెక్కుల పంపిణీలో రాజకీయాలు వద్దు..

హైదరాబాద్: ఆర్కేపురం బోనాల చెక్కుల పంపిణీ వ్యవహారంలో ఎమ్మెల్యే సబితారెడ్డి రాద్ధాంతం చేస్తున్నారని జల్‌పల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ షేక్ జహంగీర్, లాల్ సతీష్ గౌడ్, ఆదిల్ల జంగయ్యలు అన్నారు, మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి ప్రోటోకాల్ ప్రకారం గౌరవించి చెక్కుల పంపిణీకి ఆహ్వానించినా కొంతమంది బీఆర్‌ఎస్(%దీ=ూ%) నేతలు రాజకీయాలు చేస్తున్నారనన్నారు. మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మ రెడ్డి కార్యక్రమంలో పాల్గొనడంతో గొడవ చేసి నీచ రాజకీయాలు చేస్తున్నారన్నారు. కిచ్చన్న గారి లక్ష్మారెడ్డిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహేశ్వరం ఇన్‌చార్జిగా ప్రకటించారన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ఆయన ఉంటారన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు నిజాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు. రాజకీయ లబ్ధికోసం ఇలాంటి రాజకీయాలు చేయకుండా నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తే బాగుంటుందన్నారు.

## విద్యార్థులు తినే పెరుగు తాగేసిన పిల్లి.. జేఎన్టీయూలో ఇదీ వైనం

హైదరాబాద్, జూలై 17: గత కొద్ది రోజుల క్రితం సుల్తానాబాద్ జేఎన్టీయూ క్యాంటీన్ చట్నీలో ఎలుక సంఘటన మరువక ముందే కూకట్‌పల్లి జేఎన్టీయూహెచ్‌లో పెరుగును పిల్లి తాగుతున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.రెండురోజుల క్రితం కూకట్‌పల్లి జేఎన్టీయూ విద్యార్థులకు వడ్డించే ఆహార పదార్థాలను పిల్లులు తింటున్న వీడియో సామాజిక మాధ్యమాలలో చక్కర్లు కొడుతోంది. ఇప్పటికే పలువురు విద్యార్థులు క్యాంటీన్‌లో వసతి గృహంలో వడ్డిస్తున్న ఆహార పదార్థాలలో నాణ్యత, శుభ్రత ఉండటం లేదని పలుసార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ పట్టించుకోలేదు. పైగా ఫిర్యాదులు, ఆందోళనలు చేసిన విద్యార్థులపై చర్యలు తీసుకుంటామని బెదిరింపులకు పాల్పడుతున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. యూనివర్సిటీ క్యాంపస్‌లోని మంజీరా బాయ్స్ హాస్టల్లో ఆహార పదార్థాలు నాణ్యతపై ఎప్పటినుంచో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.
ఇప్పటికే పలుసార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన సంఘటనలు ఉన్నాయి. ఇలా ఉండగా రెండు రోజుల క్రితం ఆహార పదార్థాలపై మొదలు లేకపోవడంతో బకెట్లో ఆహార పదార్థాలను పిల్లి మూతి పెట్టి తింటున్న దృశ్యాలను విద్యార్థులు వీడియోలో చిత్రీకరించి సామాజిక మాధ్యమాలను పోస్ట్ చేశారు. దీంతో ఈ వీడియో గత రెండు రోజులుగా సామాజిక మాధ్యమాలలో వైరల్‌గా మారింది. మరి ఇప్పటికైనా ఆహార పదార్థాల నాణ్యత, శుభ్రతపై జేఎన్టీయూ యాజమాన్యం ఎలా స్పందిస్తూ వేచి చూడాలి.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com